RNI. TGTEL/25/A1665

నిత్యం నిఘా
తెలుగు దినపత్రిక

బూర నగేష్ గౌడ్
ఎడిటర్

మండలాలవారీగా
విలేకరులు కావలెను
సీనియర్లకు ప్రాధాన్యత
ఐడి కార్డు, ట్యాగ్, లోగో, వెహికల్ స్టిక్కర్స్ ఇవ్వబడును
ఆసక్తి, అనుభవం కలిగిన వారు సంప్రదించగలరు
94419 74025
మూసివేయలేని కన్ను - నిత్యం నిఘా

www.nityamnigha.com
RNI. TGTEL/25/A1665

నిత్యం నిఘా
తెలుగు దినపత్రిక

NITYAM NIGHA TELUGU DAILY
మూసివేయలేని కన్ను - నిత్యం నిఘా

Published From : Warangal
Circulated at : Telangana All Districts




వరంగల్ | సంపుటి 2 | సంచిక 99 | ఎడిటర్ - బూర నగేష్ గౌడ్ | శనివారం 10.10.2026 | పేజీలు : 8



# దసరా పండుగ సందడి.. కిక్కిరిసిన ఎంజీబీఎస్, జేబీఎస్

- దసరా సెలవులతో హైదరాబాద్ బస్టాండ్లలో పెరిగిన ప్రయాణికుల రద్దీ
- రాష్ట్రవ్యాప్తంగా 7,000 ప్రత్యేక బస్సులను నడుపుతున్న టీజీఎస్ఆర్టీసీ
- ప్రత్యేక బస్సుల్లో సాధారణ ఛార్జీలపై 50 శాతం అదనం
- మహాలక్ష్మి పథకం కింద మహిళలకు ఉచిత ప్రయాణం యథాతథం
- ప్రయాణికుల కోసం ప్రధాన టెర్మినళ్లలో అదనపు సౌకర్యాల ఏర్పాటు

**నిత్యం నిఘా, హైదరాబాద్ :** దసరా పండుగ సెలవులు ప్రారంభం కావడంతో హైదరాబాద్‌లోని ప్రధాన బస్టాండ్లు ప్రయాణికులతో కిక్కిరిసిపోయాయి. తెలంగాణలో పాఠశాలలకు శనివారం నుంచి దసరా సెలవులు ప్రకటించడంతో, శుక్రవారం సాయంత్రం నుంచే సొంతూళ్లకు వెళ్లేవారి సంఖ్య ఒక్కసారిగా పెరిగింది. నగరంలోని మహాత్మా గాంధీ బస్ స్టేషన్ (ఎంజీబీఎస్), జూబ్లీ బస్ స్టేషన్ (జేబీఎస్) ప్రయాణికులతో కిటకిటలాడుతున్నాయి. కుటుంబ సభ్యులు, విద్యార్థులతో బస్టాండ్ల ప్రాంగణాలన్నీ సందడిగా మారాయి. పండుగ రద్దీని దృష్టిలో ఉంచుకుని తెలంగాణ రాష్ట్ర రోడ్డు రవాణా సంస్థ (టీజీఎస్ఆర్టీసీ) భారీ ఏర్పాట్లు చేసింది. రాష్ట్రవ్యాప్తంగా ప్రయాణికుల సౌకర్యార్థం అక్టోబర్ 18వ తేదీ వరకు మొత్తం 7,000 ప్రత్యేక బస్సులను నడపనున్నట్లు ప్రకటించింది. ఈ ప్రత్యేక సర్వీసుల్లో అత్యధికంగా కరీంనగర్ జోన్ నుంచి 3,533 బస్సులు నడుస్తుండగా, హైదరాబాద్ జోన్ నుంచి 2,155, గ్రేటర్ హైదరాబాద్ జోన్ నుంచి 1,312 బస్సులు అందుబాటులో ఉన్నాయి. నగరంలోని ఎంజీబీఎస్, జేబీఎస్‌తో పాటు ఉప్పల్, ఆరాంఘర్, ఎల్బీ నగర్ క్రాస్‌రోడ్స్, కేపీహెచ్‌బీ, బోయిన్‌పల్లి, గచ్చిబౌలి వంటి కీలక ప్రాంతాల నుంచి కూడా ఈ ప్రత్యేక సర్వీసులు నడుస్తున్నాయి. అయితే, ఈ ప్రత్యేక బస్సు సర్వీసుల్లో ఛార్జీలను 1.5 రెట్లు (50 శాతం అదనంగా) పెంచినట్లు టీజీఎస్ఆర్టీసీ వెల్లడించింది. ముఖ్యంగా రద్దీ ఎక్కువగా ఉండే అక్టోబర్ 9, 10, 16, 17 తేదీలతో పాటు, తిరుగు ప్రయాణ రద్దీ ఉండే అక్టోబర్ 25, 26 తేదీల్లో ఈ పెంచిన ఛార్జీలు వర్తిస్తాయి. సాధారణ బస్సు సర్వీసుల్లో ఛార్జీలలో ఎలాంటి మార్పు లేదని, 'మహాలక్ష్మి' పథకం కింద మహిళలకు ఉచిత ప్రయాణ సౌకర్యం యథావిధిగా కొనసాగుతుందని అధికారులు స్పష్టం చేశారు. ప్రయాణికుల సౌకర్యార్థం ప్రధాన బస్టాండ్లలో తాత్కాలిక షెల్టర్లు, తాగునీటి సౌకర్యం, పబ్లిక్ అడ్రస్ సిస్టమ్స్, మొబైల్ టాయిలెట్లను ఆర్టీసీ ఏర్పాటు చేసింది. సెలవుల అనంతరం తిరుగు ప్రయాణ రద్దీని కూడా దృష్టిలో ఉంచుకుని తగిన ఏర్పాట్లు చేస్తున్నట్లు అధికారులు తెలిపారు. డిమాండ్ ఎక్కువగా ఉన్న మార్గాల్లో అవసరాన్ని బట్టి అదనపు బస్సులను నడుపుతామని, హామీ ఇచ్చారు.

## నోయిడా విమానాశ్రయానికి మోదీ పేరు.. యోగి సర్కారు కీలక నిర్ణయం!

- పేరుమార్పు తీర్మానానికి యోగి మంత్రివర్గం ఆమోదం
- మోదీ 25 ఏళ్ల ప్రజా జీవితం పూర్తి చేసుకున్న సందర్భంగా నిర్ణయం » 2
- మోదీకి రాష్ట్రంతో ప్రత్యేక అనుబంధం ఉందన్న యోగి




## సీఈసీ రాజీనామాకు పట్టు.. రాష్ట్రపతికి విపక్షాల ఫిర్యాదు

- సీఈసీ జ్ఞానేశ్ కుమార్ రాజీనామా చేయాలని విపక్షాల డిమాండ్
- పార్లమెంట్ నుంచి రాష్ట్రపతి భవన్ వరకు రాహుల్ గాంధీ భారీ ర్యాలీ
- 13 కోట్ల ఓట్లను తిరిగి చేర్చాలని రాష్ట్రపతికి వినతిపత్రం » 2
- ఓటమిని జీర్ణించుకోలేకే విపక్షాల ఆరోపణలన్న బీజేపీ చీఫ్ నడ్డా



## 'సర్' అక్రమాలపై సుప్రీం విచారణ జరపాలి.. సీఈసీ రాజీనామా చేయాలి : కేటీఆర్

- సర్ ప్రక్రియలో భారీ అక్రమాలు జరిగాయన్న కేటీఆర్
- బీఆర్ఎస్ ఎమ్మెల్యేల నియోజకవర్గాల్లో ఓట్లు తొలగించారని ఆరోపణ
- సీఈసీకి వ్యతిరేకంగా రేపు హైదరాబాద్‌లో బీఆర్ఎస్ నిరసన » 2




## ఫలితాలు వచ్చినప్పుడే ప్రజాస్వామ్యం ఉన్నట్టా?: కిషన్ రెడ్డి

- ప్రజా తీర్పును గౌరవించడం కాంగ్రెస్‌కు అలవాటు లేదన్న కిషన్ రెడ్డి
- రాహుల్ గాంధీ తీరులో ప్రమాదకర ధోరణులు కనిపిస్తున్నాయని విమర్శ
- ఫలితాలు వ్యతిరేకిస్తే రాజ్యాంగ సంస్థలపై కాంగ్రెస్ విష ప్రచారం చేస్తుందని మండిపాటు

వివరాలు 2 లో





## తెలంగాణ ఆడపడుచులకు బతుకమ్మ శుభాకాంక్షలు తెలిపిన సీఎం రేవంత్, మాజీ సీఎం కెసిఆర్

- ప్రకృతి ఆరాధనకు, ఐక్యతకు బతుకమ్మ ప్రతీక అన్న సీఎం
- ఈ పండుగ తెలంగాణ సంస్కృతికి అద్దం పడుతుందన్న ముఖ్యమంత్రి » 2
- బతుకమ్మ శుభాకాంక్షలు తెలిపిన మాజీ సీఎం కేసీఆర్

## జీఓ 59పై మంత్రి పొంగులేటి ప్రకటన.. నెలలోగా దరఖాస్తులు క్లియర్

- జీఓ 59 పెండింగ్ దరఖాస్తులకు నెల లోగా పరిష్కారం
- సీఎం రేవంత్ రెడ్డి హామీ అమలులో భాగంగా ఈ నిర్ణయమని వెల్లడి
- దరఖాస్తుల పరిశీలనకు ఆదేశాలు జారీ చేశామన్న మంత్రి



**నిత్యం నిఘా, డెస్క్ :** తెలంగాణలో జీఓ 59 కింద పెండింగ్‌లో ఉన్న దరఖాస్తుల పరిష్కారంపై ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. 500 చదరపు గజాల లోపు ఉన్న ప్లాట్లకు సంబంధించిన దరఖాస్తులను నెల రోజుల్లోగా పరిష్కరిస్తామని రాష్ట్ర రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి స్పష్టం చేశారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఇచ్చిన 22-ఏ సమస్యల పరిష్కార హామీ అమలులో ఇది మరో కీలక ముందడుగు అని అన్నారు. ఈ మేరకు పెండింగ్ దరఖాస్తులను పరిశీలించాలని ఆదేశిస్తూ ప్రభుత్వం మెమో నెం. 48030 జారీ చేసిందని మంత్రి వివరించారు. "జీఓ 59 అమలులో ఎలాంటి అక్రమాలకు తావులేదు. నిబంధనల ప్రకారమే నిర్ణయాలు ఉంటాయి" అని ఆయన హామీ ఇచ్చారు. గతంలో జారీ చేసిన కన్వేయన్స్ డీడ్‌లపై కూడా సమగ్ర సమీక్ష నిర్వహిస్తామని పొంగులేటి వెల్లడించారు... 2



## ప్రజల విశ్వాసాన్ని ఈసీ కోల్పోతోంది: హరీశ్ రావు

- అధికారంలో ఉన్నవారికి ఈసీ రక్షణ కవచం కాదన్న హరీశ్
- సీఈసీ జ్ఞానేశ్ కుమార్ రాజీనామా చేయాలని డిమాండ్ » 2
- అన్నిటికన్నా ప్రజాస్వామ్యం గొప్పదని వ్యాఖ్య



## ఇక నుంచి కేటీఆర్ మమ్మల్ని గోకపోయినా.. నేను గోకుతూనే ఉంటా! - వెంకట్ బల్మూర్

- కేటీఆర్ బాగోతాలను ప్రతీ వారం సీరియల్‌లా బయటపెడతానన్న వెంకట్
- ఆయన ఇంటికి, పార్టీ ఆఫీసుకు 'గోకుడు మందు' పంపిస్తున్నట్లు వెల్లడి
- డెక్కన్ సెరాయ్ హోటల్ వ్యాపారంపై విచారణ జరపాలని డిమాండ్ » 2

# రేవంత్ రెడ్డి కుటుంబం ఓ అనకొండ ఫ్యామిలీ : మన్నె క్రిశాంక్

## 817 ఎకరాల ప్రభుత్వ భూమి తాకట్టు పెట్టి రూ.12,818 కోట్ల రుణం తీసుకున్నారన్న క్రిశాంక్

## భూముల విలువ తగ్గించి రుణాలు పొందారంటూ ఆరోపణ

## తెలంగాణ సంపద కోసం పోరాడుతూనే ఉంటానని వెల్లడి



**నిత్యం నిఘా, హైదరాబాద్ :** ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి కుటుంబం తెలంగాణలో అక్రమాస్తులు కూడగడుతూ 'అనకొండ ఫ్యామిలీ'గా మారిందని బీఆర్ఎస్ నేత మన్నె క్రిశాంక్ తీవ్ర వ్యాఖ్యలు చేశారు. హైదరాబాద్‌లోని తెలంగాణ భవన్‌లో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. ప్రభుత్వంపై సంచలన విమర్శలు చేశారు. హైదరాబాద్‌లోని ఇజ్జత్ నగర్, మోకిల, మియాపూర్, ఇంజాపూర్, చిలుకూరు, పటాన్‌చెరు, గాజులరామారం, జవహర్ నగర్ వంటి అత్యంత విలువైన ప్రాంతాల్లోని 817 ఎకరాల భూమిని తాకట్టు పెట్టి రూ.12,818 కోట్లకు పైగా రుణాలు సమీకరించారని ఆయన ఆరోపించారు. ఈ భూముల మార్కెట్ విలువ ఎకరానికి రూ.150 కోట్లకు పైగా ఉండగా, కేవలం రూ.15 కోట్లుగా చూపించి రుణాలు పొందారని విమర్శించారు. తాకట్టు పెట్టిన భూమిలో కేఎల్ఎస్ఆర్ ఇన్ఫ్రా సంస్థ ఎలా కంటైనర్లను ఏర్పాటు చేసిందని ఆయన ప్రశ్నించారు. తాను అక్రమాస్తులపై ప్రశ్నిస్తుంటే నిజం బయటపడుతుందన్న భయంతోనే ముఖ్యమంత్రి, ఆయన బృందం స్పందించడం లేదని క్రిశాంక్ అన్నారు. తాను వ్యక్తిగత ఆస్తుల గురించి కాకుండా, తెలంగాణ సంపద గురించే ప్రశ్నిస్తున్నానని, ఎన్ని బెదిరింపులు వచ్చినా రాష్ట్ర వనరుల పరిరక్షణకు పోరాడుతూనే ఉంటానని స్పష్టం చేశారు.

# ప్రజల విశ్వాసాన్ని ఈసీ కోల్పోతోంది : హరీశ్ రావు

**మొదటిపేజీ తరువాయి..** భారత ప్రజాస్వామ్య వ్యవస్థకు ఎన్నికల సంఘం (ఈసీ) వెన్నెముక వంటిదని, అది అధికారంలో ఉన్నవారికి రక్షణ కవచంలా మారకూడదని బీఆర్ఎస్ సీనియర్ నేత, మాజీ మంత్రి హరీశ్ రావు అన్నారు. ప్రధాన ఎన్నికల కమిషనర్ (సీఈసీ) జ్ఞానేశ్ కుమార్ వెంటనే తన పదవికి రాజీనామా చేయాలని ఆయన డిమాండ్ చేశారు. ఎన్నికల సంఘం పనితీరు, నియామకాలపై వస్తున్న ప్రశ్నలతో రాజ్యాంగ పునాదులు బలహీనపడుతున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. ఓటర్ల జాబితా సవరణలో (సర్) భాగంగా పెద్ద ఎత్తున ఓట్లను తొలగించడం వల్లే ఈసీపై ప్రజలకు నమ్మకం పోతోందన్నారు. "ప్రజాస్వామ్యం అన్నింటికన్నా గొప్పది. ప్రజల విశ్వాసాన్ని నిలబెట్టడంలో విఫలమైతే, అందుకు బాధ్యత వహిస్తూ సీఈసీ జ్ఞానేశ్ కుమార్ తప్పుకోవాలి" అని హరీశ్ రావు స్పష్టం చేశారు. రాజ్యాంగంలోని ఆర్టికల్స్ 324, 325, 326 ప్రకారం స్వేచ్ఛాయుతమైన, నిష్పక్షపాతమైన ఎన్నికలు జరగాలని గుర్తుచేశారు.

# జీఓ 59పై మంత్రి పొంగులేటి ప్రకటన.. నెలలోగా దరఖాస్తులు క్లియర్

**మొదటిపేజీ తరువాయి..** సీఎం హామీ ఇచ్చిన 24 గంటల్లోనే 22-ఏ సమస్యలపై ఉన్నతస్థాయి కమిటీని ఏర్పాటు చేశామని... 10 నుంచి 12 రకాల సమస్యలను వేగంగా పరిష్కరించేందుకు చర్యలు తీసుకుంటున్నామని ఆయన అన్నారు. జీఓ 118, జీఓ 76లకు అనుగుణంగా స్పష్టమైన మెమోలు జారీ చేసినట్లు తెలిపారు. అలాగే జీహెచ్ఎంసీ, హెచ్ఎండీఏ, డీటీసీపీ వంటి సంస్థల నుంచి ముందస్తు అనుమతులు పొంది 22-ఏ జాబితాలో ఉన్న ఇళ్లు, ప్లాట్లు, ఫ్లాట్ల రిజిస్ట్రేషన్లకు కూడా అనుమతి ఇస్తున్నట్లు మంత్రి పొంగులేటి ప్రకటించారు.

# ఫలితాలు వచ్చినప్పుడే ప్రజాస్వామ్యం ఉన్నట్టా? : కిషన్ రెడ్డి

**మొదటిపేజీ తరువాయి..** కాంగ్రెస్ పార్టీకి, ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీకి ప్రజాతీర్పును గౌరవించడం అలవాటు లేదని కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి విమర్శించారు. రాహుల్ గాంధీ పనితీరులో ఒక వింత, ప్రమాదకరమైన ధోరణి కనిపిస్తోందని ఆయన ఆరోపించారు. వారికి అనుకూలంగా ఫలితాలు వచ్చినప్పుడే ప్రజాస్వామ్యం ఉన్నట్టా? అని ప్రశ్నించారు. ఫలితాలు వ్యతిరేకంగా వస్తే రాజ్యాంగ సంస్థలపై విష ప్రచారం చేస్తారా? అని నిలదీశారు. కాంగ్రెస్ పార్టీ తన రాజకీయ ప్రయోజనాలకు అనుగుణంగా పనిచేయనప్పుడల్లా ఎన్నికల సంఘం, కాగ్, న్యాయవ్యవస్థ, పార్లమెంట్ వంటి రాజ్యాంగ సంస్థల విశ్వసనీయతను దెబ్బతీయడం అలవాటుగా మార్చుకుందని ఆయన ఆరోపించారు. ప్రజాతీర్పు వ్యతిరేకంగా వచ్చినప్పుడు, రాజ్యాంగ సంస్థలు అవినీతి మయమయ్యాయని కాంగ్రెస్ నేతలు ఆరోపణలకు దిగుతున్నారని కిషన్ రెడ్డి మండిపడ్డారు. ఈ కీలకమైన సంస్థలపై ప్రజలు ఉంచిన నమ్మకాన్ని దెబ్బతీసే లక్ష్యంతోనే కాంగ్రెస్ ఇలాంటి ప్రచారాలు చేస్తోందని ఆయన విమర్శించారు.

# నోయిడా విమానాశ్రయానికి మోదీ పేరు.. యోగి సర్కారు కీలక నిర్ణయం!

**మొదటిపేజీ తరువాయి..**

ఉత్తర్‌ప్రదేశ్‌లోని నోయిడాలో ఉన్న జెవార్ అంతర్జాతీయ విమానాశ్రయం పేరును మార్చాలని యోగి ఆదిత్యనాథ్ ప్రభుత్వం నిర్ణయించింది. ఇకపై ఈ విమానాశ్రయాన్ని 'నరేంద్ర మోదీ అంతర్జాతీయ విమానాశ్రయం'గా పిలవనున్నారు. ప్రధాని మోదీ ప్రజా సేవలో 25 ఏళ్లు పూర్తి చేసుకున్న సందర్భంగా ఈ నిర్ణయం తీసుకున్నట్లు ముఖ్యమంత్రి యోగి ఆదిత్యనాథ్ వెల్లడించారు. ఈ మేరకు రాష్ట్ర మంత్రివర్గం తీర్మానాన్ని ఆమోదించిందని తెలిపారు. శుక్రవారం జరిగిన మంత్రివర్గ సమావేశంలో మొత్తం 39 ప్రతిపాదనలకు ఆమోదం లభించింది. అనంతరం మీడియాతో మాట్లాడిన యోగి.. దేశ, రాష్ట్ర అభివృద్ధిలో మోదీ 25 ఏళ్ల ప్రజా సేవ కీలక పాత్ర పోషించిందని పేర్కొన్నారు. ఉత్తర్‌ప్రదేశ్‌తో ప్రధానికి ప్రత్యేక అనుబంధం ఉందని, వారణాసి నుంచి ఎంపీగా ఎన్నికైన ఆయన నాయకత్వంలో రాష్ట్రం అభివృద్ధిలో ముందుకు సాగుతోందని చెప్పారు. 2017కు ముందు రాష్ట్రంలో మౌలిక సదుపాయాలు అంతంత మాత్రంగానే ఉండేవని యోగి పేర్కొన్నారు. ప్రస్తుతం ఎక్స్‌ప్రెస్‌వేలు, జాతీయ రహదారులు, మెట్రో, రీజినల్ ర్యాపిడ్ ట్రాన్సిట్ వ్యవస్థలతో రవాణా సౌకర్యాలు గణనీయంగా మెరుగయ్యాయని తెలిపారు. అయోధ్య రామమందిర నిర్మాణం, కాశీ విశ్వనాథ్ కారిడార్ అభివృద్ధి వంటి కార్యక్రమాలను కూడా ప్రస్తావించారు. జెవార్‌లో నిర్మిస్తున్న నోయిడా విమానాశ్రయం ఉత్తర్‌ప్రదేశ్‌కు అందించిన గొప్ప బహుమతిగా యోగి అభివర్ణించారు. ఇది భవిష్యత్తులో దేశంలోనే కీలక విమానయాన కేంద్రంగా ఎదుగుతుందని ఆశాభావం వ్యక్తం చేశారు. ఈ విమానాశ్రయం తొలి దశను ప్రధాని మోదీ ఈ ఏడాది మార్చిలో ప్రారంభించారు. మొదటి దశలో ఏడాదికి సుమారు 1.2 కోట్ల మంది ప్రయాణికులకు సేవలందించే సామర్థ్యం ఉండనుంది. నాలుగు దశల నిర్మాణం పూర్తయితే ఆసియాలోనే అతిపెద్ద విమానాశ్రయాల్లో ఒకటిగా నిలవనుంది.

# సీఈసీ రాజీనామాకు పట్టు.. రాష్ట్రపతికి విపక్షాల ఫిర్యాదు

**మొదటిపేజీ తరువాయి..**

కేంద్ర ఎన్నికల సంఘం (ఈసీ) పనితీరుపై ప్రతిపక్షాలు తమ పోరాటాన్ని తీవ్రతరం చేశాయి. చీఫ్ ఎలక్షన్ కమిషనర్ (సీఈసీ) జ్ఞానేశ్ కుమార్ వెంటనే రాజీనామా చేయాల ని డిమాండ్ చేస్తూ కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ నేతృత్వంలో 'ఇండియా' కూటమి ఎంపీలు, నాయకులు పార్లమెంట్ నుంచి రాష్ట్రపతి భవన్ వరకు శుక్రవారం భారీ ర్యాలీ నిర్వహించారు. అనంతరం 10 మంది సభ్యుల ప్రతినిధి బృందం రాష్ట్రపతి ద్రౌపది ముర్మును కలిసి వినతిపత్రం సమర్పించింది. సీఈసీ జ్ఞానేశ్ కుమార్ రాజీనామా చేయాలన్నది తమ ప్రధాన డిమాండ్ అని ప్రతిపక్షాలు స్పష్టం చేశాయి. దీనితో పాటు, వివాదాస్పదంగా మారిన స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ (ఎస్ఐఆర్) ఓటర్ల జాబితా సవరణ ప్రక్రియను తక్షణమే రద్దు చేయాలని, ముసాయిదా జాబితాల నుంచి అన్యాయంగా తొలగించిన 13 కోట్ల మంది ఓటర్ల పేర్లను తిరిగి చేర్చాలని వారు రాష్ట్రపతిని కోరారు. ఈ మేరకు 16 పార్టీలకు చెందిన నేతలు సంతకాలు చేసిన మెమొరాండంను ఆమెకు అందజేశారు. ర్యాలీ సందర్భంగా విపక్ష నేతలు కర్తవ్య పథ్‌పై బైఠాయించి నిరసన వ్యక్తం చేశారు. 'ఓట్ చోరీ' జరిగిందని, ఈసీ-బీజేపీ కుమ్మక్కయ్యాయని ఆరోపిస్తూ నినాదాలు చేశారు. "జ్ఞానేశ్, ఇట్స్ డన్ బ్రో!" వంటి ప్లకార్డులను ప్రదర్శించారు. ఈ సందర్భంగా కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే మాట్లాడుతూ, "జ్ఞానేశ్ కుమార్ తీసుకున్న నిర్ణయాల వల్ల దేశంలో ఆందోళకర వాతావరణం నెలకొంది. ప్రజాస్వామ్యం ప్రమాదంలో పడింది. అందుకే రాష్ట్రపతిని కలిసి వాస్తవాలను వివరిస్తున్నాం" అని పేర్కొన్నారు. దేశంలో నెలకొన్న అక్రమ వ్యవస్థకు జ్ఞానేశ్ కుమార్ కవచంలా నిలుస్తున్నారని ఆర్జేడీ ఎంపీ మనోజ్ ఝా విమర్శించారు. మరోవైపు, పేపర్ లీక్‌లకు వ్యతిరేకంగా పోరాడి విద్యాశాఖ మంత్రి రాజీనామాకు కారణమైన 'కాక్రోచ్ జనతా పార్టీ', శనివారం జంతర్ మంతర్ వద్ద నిరసనకు పిలుపునిచ్చింది. దీంతో ప్రభుత్వం అప్రమత్తమైంది. జంతర్ మంతర్ పరిసరాల్లో 4 కిలోమీటర్ల పరిధిలో వేలాది మంది పోలీసులను మోహరించడంతో పాటు, శుక్రవారం రాత్రి నుంచి 24 గంటల పాటు ఇంటర్నెట్ సేవలను నిలిపివేసింది. విపక్షాల ఆందోళనలపై బీజేపీ జాతీయ అధ్యక్షుడు జేపీ నడ్డా తీవ్రంగా స్పందించారు. వరుస ఓటములను జీర్ణించుకోలేకే ఇండియా కూటమి రాజ్యాంగబద్ధ వ్యవస్థలపై నిందలు వేస్తోందని ఆయన విమర్శించారు. "ప్రధాని మోదీ నాయకత్వంపై ప్రజలకున్న విశ్వాసానికి ఇటీవలి ఉప ఎన్నికల ఫలితాలే నిదర్శనం. ఆత్మపరిశీలన చేసుకోకుండా ఆరోపణలు చేయడం వారి రాజకీయ నైరాశ్యాన్ని బయటపెడుతోంది" అని ఆయన 'ఎక్స్' వేదికగా పేర్కొన్నారు.

# 'సర్' అక్రమాలపై సుప్రీం విచారణ జరపాలి.. సీఈసీ రాజీనామా చేయాలి: కేటీఆర్

**మొదటిపేజీ తరువాయి..** ఓటర్ల జాబితా ప్రత్యేక సవరణ (SIR) ప్రక్రియలో భారీ అక్రమాలు జరిగాయని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ధ్వజమెత్తారు. జరిగిన అక్రమాలపై తీవ్ర స్థాయిలో స్పందించారు. ఈ వ్యవహారంపై సుప్రీంకోర్టు సుమోటోగా విచారణ చేపట్టి, సిట్టింగ్ జడ్జితో స్వతంత్ర దర్యాప్తు జరిపించాలని ఆయన డిమాండ్ చేశారు. అదే సమయంలో, చీఫ్ ఎలక్షన్ కమిషనర్ (సీఈసీ) జ్ఞానేశ్ కుమార్ తక్షణమే తన పదవికి రాజీనామా చేయాలని కోరారు. ఈ మేరకు ఎక్స్ వేదికగా కేటీఆర్ ఒక ప్రకటన విడుదల చేశారు. భారత రాజ్యాంగానికి మించింది ఏదీ లేదని, ఏ ఒక్క భారత పౌరుడి ఓటు హక్కును హరించలేరని ఆయన స్పష్టం చేశారు. ఒక వ్యక్తిని కాపాడటం కోసం 140 కోట్ల మంది భారతీయుల హక్కులను ఎలా కాలరాస్తారని ప్రశ్నించారు. ప్రజాస్వామ్యానికి మూలస్తంభమైన ఓటు హక్కును బలహీనపరిచే కుట్రలపై న్యాయవ్యవస్థ జోక్యం చేసుకోవాలని ఆయన విజ్ఞప్తి చేశారు. SIR ప్రక్రియలో భాగంగా, ముఖ్యంగా బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు ప్రాతినిధ్యం వహిస్తున్న నియోజకవర్గాల్లో భారీ ఎత్తున ఓటర్ల పేర్లను తొలగించారని ఆయన ఆరోపించారు. మరోవైపు, రేపు హైదరాబాద్‌లోని రాష్ట్ర ముఖ్య ఎన్నికల అధికారి కార్యాలయం ఎదుట నిరసన కార్యక్రమం చేపట్టనున్నట్లు బీఆర్ఎస్ పార్టీ ప్రకటించింది. ఈ ఆందోళనలను భవిష్యత్తులో ఢిల్లీకి కూడా విస్తరిస్తామని పార్టీ వర్గాలు తెలిపాయి.

# తెలంగాణ ఆడపడుచులకు బతుకమ్మ శుభాకాంక్షలు తెలిపిన - సీఎం రేవంత్, మాజీ సీఎం కెసిఆర్

**మొదటిపేజీ తరువాయి..** తెలంగాణ ప్రజలకు, ముఖ్యంగా రాష్ట్ర మహిళలకు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి బతుకమ్మ పండుగ శుభాకాంక్షలు తెలియజేశారు. శనివారం నుంచి ప్రారంభం కానున్న ఈ తొమ్మిది రోజుల పూల ఉత్సవాలను మహిళలందరూ ఆనందోత్సాహాల మధ్య, సంప్రదాయ పాటలు, నృత్యాలతో ఘనంగా జరుపుకోవాలని ఆయన ఆకాంక్షించారు. ఈ మేరకు శుక్రవారం ఆయన ఒక సందేశాన్ని విడుదల చేశారు. బతుకమ్మ పండుగ తెలంగాణ విశిష్ట సంస్కృతికి అద్దం పడుతుందని, ప్రకృతిని ఆరాధించే అత్యంత గొప్ప సంప్రదాయమని సీఎం రేవంత్ రెడ్డి అభివర్ణించారు. తీరొక్క పూలతో బతుకమ్మను పేర్చి, గౌరమ్మను పూజించడం తెలంగాణ జీవన విధానంలో ఒక భాగమని ఆయన పేర్కొన్నారు. ఎంగిలిపూల బతుకమ్మతో మొదలై సద్దుల బతుకమ్మ వరకు సాగే ఈ వేడుకలు ప్రజల మధ్య ఐక్యతను, సామూహిక జీవన సౌందర్యాన్ని చాటిచెబుతాయని ఆయన కొనియాడారు. బతుకమ్మ పండుగ సందర్భంగా మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ కూడా ప్రజలకు శుభాకాంక్షలు తెలిపారు. తెలంగాణ రాష్ట్రం సిద్ధించిన తర్వాత తమ ప్రభుత్వం బతుకమ్మను రాష్ట్ర పండుగగా గుర్తించిన విషయాన్ని ఆయన ఈ సందర్భంగా గుర్తు చేశారు. ఈ పండుగ నేడు తెలంగాణ ప్రజల జీవనశైలిలో ఒక అంతర్భాగంగా మారిపోయిందని ఆయన పేర్కొన్నారు.


# ఇక నుంచి కేటీఆర్ మమ్మల్ని గోకకపోయినా.. నేను గోకుతూనే ఉంటా..! : వెంకట్ బల్మూర్

**మొదటిపేజీ తరువాయి..** బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్‌పై ప్రభుత్వ విప్ వెంకట్ బల్మూర్ తీవ్రస్థాయిలో విరుచుకుపడ్డారు. కేటీఆర్ వ్యవహారశైలిపై సంచలన ఆరోపణలు చేసిన ఆయన, ఇకపై ప్రతీ వారం ఒక సీరియల్ లాగా ఆయన బాగోతాలను బయటపెడతానని హెచ్చరించారు. "ఇక నుంచి కేటీఆర్ మమ్మల్ని గోకకపోయినా, నేను గోకుతూనే ఉంటా" అని వ్యాఖ్యానించిన బల్మూర్, కేటీఆర్ ఇంటికి, పార్టీ ఆఫీసుకు 'గోకుడు మందు' (ఇచ్ గార్డ్) పంపిస్తున్నట్లు ప్రకటించారు. ఈ సందర్భంగా వెంకట్ బల్మూర్ మాట్లాడుతూ.. తాము కేటీఆర్ బాగోతాలు బయటపెడితే, బీఆర్ఎస్ నేతలు తమ ముఖ్యమంత్రిపై సోషల్ మీడియాలో అసభ్యకర పోస్టులు పెట్టిస్తున్నారని ఆరోపించారు. 2019 నుంచి 2022 మధ్య ఓ సినీ నటితో జరిపిన సోషల్ మీడియా సంభాషణలను కేటీఆర్ ఎందుకు డిలీట్ చేశారో చెప్పాలని డిమాండ్ చేశారు. కేటీఆర్ హోటల్ వ్యాపార రహస్యాలు ప్రజల ముందు ఉంచాలన్నారు. "2015లో రూ.5 కోట్లుగా ఉన్న డెక్కన్ సెరాయ్ హోటల్ షేర్ విలువ, పదేళ్లలో రూ.175 కోట్లకు ఎలా పెరిగింది? ఈ అంశంపై సంబంధిత అధికారులకు ఫిర్యాదు చేసి విచారణ కోరతాం" అని స్పష్టం చేశారు. ఏ విచారణకైనా సిద్ధమని చెప్పే కేటీఆర్, పాస్‌పోర్ట్ సీజ్ చేయాలన్న పోలీసుల అభ్యర్థనపై కోర్టును ఎందుకు ఆశ్రయించారని బల్మూర్ ప్రశ్నించారు. కేటీఆర్ చెప్పేవి నీతి మాటలని, చేసేవి అవినీతి పనులని విమర్శించారు. తెలంగాణ ప్రభుత్వం డ్రగ్స్‌ను అరికట్టేందుకు కృషి చేస్తుంటే, కేటీఆర్ డ్రగ్స్‌కు బ్రాండ్ అంబాసిడర్‌గా మారుతున్నారని తీవ్ర ఆరోపణ చేశారు. తాను చెప్పేవన్నీ అబద్ధాలైతే కేటీఆర్ లైవ్‌లోకి వచ్చి వాస్తవాలు చెప్పాలని, డ్రగ్ టెస్టుకు సిద్ధమని ప్రకటించాలని సవాల్ విసిరారు. ప్రస్తుతం కేసీఆర్ కూడా కేటీఆర్‌తో మాట్లాడటం లేదని, తండ్రీకొడుకుల మధ్య పంచాయతీని నవీన్ రావు తండ్రి కొండల్ రావు పరిష్కరించే ప్రయత్నం చేస్తున్నారని బల్మూర్ సంచలన వ్యాఖ్యలు చేశారు. కేటీఆర్ ఎందుకు ఎవరితో కలవడం లేదో బీఆర్ఎస్ మిత్రులు కూడా ఆలోచించాలని ఆయన సూచించారు. అంతేకాకుండా, ఫాంహౌస్ లో కేటీఆర్ కు రహస్య ట్రీట్ మెంట్ అంటూ సంచలన ట్వీట్లు కూడా చేశారు.

నిత్యం నిఘా
తెలుగు దినపత్రిక

# రామప్పకు ఓపెన్ కాస్ట్ సెగ

## - 300 మీటర్ల లోతున బొగ్గు తవ్వకాలు.. ఆలయం, సరస్సు భద్రతపై ఆందోళన



**నిత్యం నిఘా ప్రత్యేక కథనం**

కాకతీయుల శిల్పకళా వైభవానికి ప్రతీకగా నిలిచిన రామప్ప ఆలయం, వేలాది ఎకరాలకు సాగునీరు అందిస్తున్న రామప్ప సరస్సు భద్రతపై ఆందోళనలు వ్యక్తమవుతున్నాయి. ఆలయం, సరస్సుకు సుమారు ఐదు కిలోమీటర్ల దూరంలో సింగరేణి ప్రతిపాదించిన ఓపెన్‌కాస్ట్ బొగ్గు గనిలో 300 మీటర్ల లోతు వరకు తవ్వకాలు చేపడితే భూగర్భ జలాల ప్రవాహంలో మార్పులు చోటుచేసుకునే అవకాశం ఉందని కాకతీయ వారసత్వ పరిరక్షణ సంస్థ సభ్యుడు, వరంగల్ జాతీయ సాంకేతిక సంస్థ విశ్రాంత ఆచార్యుడు ఎం. పాండు రంగారావు ఆందోళన వ్యక్తం చేశారు. భూగర్భ చీలికల ద్వారా సరస్సు నీరు లీకవడం, కట్ట స్థిరత్వం దెబ్బతినడం, ఆలయ పునాదిపై ప్రతికూల ప్రభావం పడే ప్రమాదాలను శాస్త్రీయంగా పరిశీలించాలని ఆయన కోరారు. కాకతీయుల వారసత్వ సంపదను కాపాడేందుకు గని ప్రతిపాదనపై పునరాలోచించాలని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలకు విజ్ఞప్తి చేశారు. తెలంగాణ డిజిటల్ మీడియా ప్రతినిధులతో మాట్లాడిన పాండు రంగారావు.. ప్రతిపాదిత గని ప్రభావాలపై తమ సంస్థ వ్యక్తం చేస్తున్న అభ్యంతరాలను వివరించారు.



### భూగర్భ చీలికలే కీలకం

గని ప్రాంతానికి, రామప్ప ఆలయం, సరస్సుకు మధ్య ఉన్న దూరాన్ని మాత్రమే పరిగణనలోకి తీసుకుని ప్రమాదాన్ని అంచనా వేయడం సరికాదని పాండు రంగారావు పేర్కొన్నారు. భూమి లోపల ఉన్న రాతి పొరలు, భ్రంశాలు, చీలికలు, భూగర్భ జలాల ప్రవాహ మార్గాలను సమగ్రంగా పరిశీలించాల్సిన అవసరం ఉందన్నారు. వెంకటాపురం వద్ద ప్రతిపాదించిన గని ప్రాంతానికి, రామప్ప సరస్సుకు మధ్య భౌగోళిక సంబంధం ఉందని తమ సంస్థ రూపొందించిన పటంలో వివరించినట్లు తెలిపారు. తవ్వకాలు, పేలుళ్ల వల్ల భూగర్భ నిర్మాణాలపై ఒత్తిడి పెరిగితే ఇప్పటికే ఉన్న చీలికలు క్రియాశీలమయ్యే అవకాశం ఉందని, అందువల్ల స్వతంత్ర భౌగోళిక అధ్యయనం నిర్వహించాలని కోరారు.

### సరస్సు నీరు లీకైతే కట్టకు ముప్పు



ప్రాణహిత–గోదావరి గ్రాబెన్ బేసిన్‌లో భాగమైన ఈ ప్రాంతంలో వివిధ రకాల శిలా నిర్మాణాలు, ఇసుకరాయి, షేల్, కంకర పొరలు ఉన్నాయని ఆయన వివరించారు. గని తవ్వకాలు 300 మీటర్ల లోతు వరకు సాగితే భూగర్భ జలాల మట్టం, నీటి పీడనంలో మార్పులు సంభవించే అవకాశాన్ని విస్మరించకూడదన్నారు. గని ప్రాంతంలో నీటి పీడనం తగ్గితే భూగర్భ చీలికలు, రాతి పొరల మధ్య ఖాళీల ద్వారా సరస్సు నీరు ఆ వైపు ప్రవహించే ప్రమాదం ఉందని ఆందోళన వ్యక్తం చేశారు. రెండు కొండలను కలుపుతూ నిర్మించిన రామప్ప సరస్సు మట్టి కట్ట భద్రతపై తమ సంస్థ పలు సందేహాలను లేవనెత్తిందన్నారు. కట్ట కింద భూగర్భ పరిస్థితుల్లో మార్పులు వస్తే దాని స్థిరత్వంపై ప్రభావం పడవచ్చని పేర్కొన్నారు. సరస్సు కట్టకు నష్టం జరిగితే దిగువ ప్రాంతాల్లోని ప్రజలు, పంటలు, ఆస్తులకు తీవ్ర నష్టం వాటిల్లే ప్రమాదం ఉన్నందున ముందస్తు అధ్యయనాలు చేపట్టాలని సూచించారు.

### ఆలయ పునాది స్థిరత్వంపై ఆందోళన



రామప్ప ఆలయ నిర్మాణంలో ఉపయోగించిన ఇసుక పెట్టె పునాది పద్ధతి కాకతీయుల ఇంజినీరింగ్ నైపుణ్యానికి నిదర్శనమని పాండు రంగారావు అన్నారు. అయితే భూగర్భ జలాల ప్రవాహంలో మార్పులు చోటుచేసుకుంటే పునాదిలోని ఇసుక, మట్టి రేణువులు కొట్టుకుపోయి అంతర్గత ఖాళీలు ఏర్పడే అవకాశం ఉందని వివరించారు. ఈ ప్రక్రియను సాంకేతికంగా 'పైపింగ్'గా పేర్కొంటారని తెలిపారు. పునాదిలో ఖాళీలు ఏర్పడితే ఆలయ నిర్మాణ స్థిరత్వం దెబ్బతినే ప్రమాదం ఉందన్నారు. ఆలయంలోని రంగమండపం దూలాలకు ఉన్న పగుళ్లు, నిర్మాణంలో అసమాన కూర్చివేత వంటి అంశాలను తమ సంస్థ నివేదికలో ప్రస్తావించినట్లు చెప్పారు. గని తవ్వకాల వల్ల భూగర్భ జలాల ప్రవాహంలో ఎలాంటి మార్పులు వస్తాయి? వాటి ప్రభావం ఆలయ పునాదిపై పడుతుందా? అన్న అంశాలను స్వతంత్ర నిపుణులతో పరిశీ



లించాలని కోరారు.

### జీఎస్ఐ నివేదికను సమగ్రంగా పరిశీలించాలి

2023 జూన్ 30 తేదీతో ఉన్న భారత భౌగోళిక సర్వేక్షణ సంస్థ నివేదికలోని అంశాలను తమ అభ్యంతరాల్లో ప్రస్తావించినట్లు పాండు రంగారావు తెలిపారు. నివేదికలోని 21, 22 పేజీల వివరాలు సరస్సు నీటిమట్టం, భూగర్భ జలాల కదలిక, ప్రతిపాదిత గని ప్రభావాలను అర్థం చేసుకోవడంలో కీలకమని పేర్కొన్నారు. సరస్సు నీటిమట్టం, భౌగోళిక చీలికలు, రాతి పొరల మధ్య ఖాళీల ద్వారా నీరు ప్రవహించే తీరు పరస్పరం సంబంధం కలిగి ఉంటాయని వివరించారు. గని వల్ల ప్రమాదం లేదని తేల్చే ముందు నివేదికలోని పూర్తి వివరాలను సంబంధిత శాఖలు పరిశీలించాలని, అవసరమైతే స్వతంత్ర శాస్త్రీయ అధ్యయనం నిర్వహించి స్పష్టత తీసుకురావాలని కోరారు.

### పేలుళ్ల ప్రకంపనల ప్రభావంపై అధ్యయనం అవసరం

ఓపెన్‌కాస్ట్ గనిలో బొగ్గు తవ్వకాల కోసం నిర్వహించే పేలుళ్ల ప్రకంపనలు ఆలయ పునాది, దూలాలు, రాతి నిర్మాణాలపై ఎలాంటి ప్రభావం చూపుతాయో శాస్త్రీయంగా అంచనా వేయాలని ఆయన సూచించారు. ప్రకంపనల తీవ్రత, వ్యాప్తి, ఆలయానికి ఉన్న దూరం, పునాది నిర్మాణం వంటి అంశాలను పరిగణనలోకి తీసుకోవాలన్నారు. గని ప్రారంభానికి ముందే ఆలయ ప్రస్తుత నిర్మాణ స్థితిని నమోదు చేసి, ఆ తర్వాత వచ్చే మార్పులను నిపుణులతో నిరంతరం పర్యవేక్షించాలని పేర్కొన్నారు. పురాతన కట్టడాలకు నష్టం జరిగిన తర్వాత స్పందించడం కంటే ముందుగానే ప్రమాదాలను గుర్తించి నివారించడం ముఖ్యమని స్పష్టం చేశారు.

### సాగునీటి భద్రతపైనా ప్రభావం



రామప్ప సరస్సు ఈ ప్రాంత వ్యవసాయానికి కీలకమైన జలవనరు. సరస్సు సుమారు మూడు టీఎంసీల నీటి నిల్వ సామర్థ్యం కలిగి ఉందని, దాదాపు 30 వేల ఎకరాలకు సాగునీరు అందిస్తోందని ఒక అంచనా ఉందని పాండు రంగారావు తెలిపారు. ప్రత్యక్షంగా, పరోక్షంగా కలిపి సుమారు 80 వేల ఎకరాల సాగుపై దీని ప్రభావం ఉంటుందని మరో అంచనా చెబుతోందన్నారు. అయితే ఈ గణాంకాలను అధికారిక నీటిపారుదల రికార్డులతో ధ్రువీకరించాల్సి ఉందని పేర్కొన్నారు. సరస్సు నీటి ప్రవాహంలో మార్పులు వస్తే రైతుల జీవనాధారం, పంటల ఉత్పత్తి, గ్రామీణ ఆర్థిక వ్యవస్థపై ప్రభావం పడే అవకాశం ఉందన్నారు. గని ప్రతిపాదనను పరిశీలించేటప్పుడు బొగ్గు ఉత్పత్తితోపాటు సాగునీటి భద్రత, ప్రజల జీవనోపాధి, పర్యావరణ ప్రభావాలను కూడా పరిగణనలోకి తీసుకోవాలని కోరారు.

### ప్రపంచ వారసత్వ గుర్తింపును పరిరక్షించాలి


2021 జూలై 25న రామప్ప ఆలయానికి ఐక్యరాజ్యసమితి విద్యా, వైజ్ఞానిక, సాంస్కృతిక సంస్థ (యునెస్కో) ప్రపంచ వారసత్వ గుర్తింపు లభించింది. కాకతీయుల నిర్మాణ కళ, శిల్ప సంపద, ఇంజినీరింగ్ ప్రతిభకు దక్కిన ఈ గుర్తింపు అంతర్జాతీయ స్థాయిలో తెలంగాణ ఖ్యాతిని పెంచింది.


ఆలయాన్ని మాత్రమే కాకుండా దాని పరిసరాల్లోని సహజ, భౌగోళిక పరిస్థితులు, సరస్సు భద్రతను కూడా పరిరక్షించాల్సిన బాధ్యత ప్రభుత్వాలపై ఉందని పాండు రంగారావు అన్నారు. గని తవ్వకాలు, పేలుళ్ల వల్ల ఆలయ నిర్మాణం లేదా పరిసరాలపై ప్రతికూల ప్రభావం ఏర్పడుతుందా? అన్న అంశాన్ని సంబంధిత వారసత్వ పరిరక్షణ ప్రమాణాల ప్రకారం నిపుణులు అంచనా వేయాలని సూచించారు.

### కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలకు లేఖలు



వెంకటాపురం వద్ద సింగరేణి ప్రతిపాదించిన ఓపెన్‌కాస్ట్ గనిపై మొదటి నుంచీ అభ్యంతరాలు వ్యక్తం చేస్తున్నామని పాండు రంగారావు తెలిపారు. 2023 మార్చి 1న ములుగు జిల్లా కలెక్టర్ అధ్యక్షతన జరిగిన సమావేశం, మార్చి 28న కలెక్టర్ నుంచి వచ్చిన లేఖ, ఏప్రిల్ 1న తాము పంపిన లేఖ, 2024 డిసెంబరు 19న జరిగిన సమావేశానికి సంబంధించిన వివరాలను 2025 జనవరి 27న కేంద్ర బొగ్గు, గనుల శాఖ మంత్రి జి. కిషన్‌రెడ్డికి పంపిన లేఖలో ప్రస్తావించినట్లు చెప్పారు. 2026 అక్టోబరు 3న సింగరేణి సంస్థ చైర్మన్, మేనేజింగ్ డైరెక్టర్ డాక్టర్ బుద్ధప్రకాశ్ జ్యోతికి కూడా లేఖ రాసి, గని ప్రభావాలను వివరించేందుకు వ్యక్తిగతంగా కలిసే అవకాశం కోరినట్లు తెలిపారు. గని అనుమతుల ప్రస్తుత స్థితి, పర్యావరణ అనుమతులు, పాలంపేట ప్రత్యేక అభివృద్ధి సంస్థ నిరభ్యంతర ధ్రువపత్రం, భౌగోళిక సర్వేక్షణ సంస్థ నివేదికపై తీసుకున్న చర్యలను సంబంధిత సంస్థలు వెల్లడించాలని కోరారు. రామప్ప ఆలయం, సరస్సు భద్రతపై ఉన్న సందేహాలకు శాస్త్రీయ ఆధారాలతో సమాధానాలు లభించే వరకు తొందరపాటు నిర్ణయాలు తీసుకోవద్దని విజ్ఞప్తి చేశారు. కాకతీయుల వారసత్వ సంపదను భావితరాలకు అందించాలంటే ప్రతిపాదిత గనిపై పునరాలోచించి, అవసరమైన స్వతంత్ర అధ్యయనాలు నిర్వహించాలని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలను కోరారు.





# ఆర్ట్స్ కళాశాలలో అంబరాన్నంటిన బతుకమ్మ సంబరాలు



**హనుమకొండ, అక్టోబర్ 09 (నిత్యం నిఘా ప్రతినిధి) :** తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలకు ప్రతీకగా నిలిచే బతుకమ్మ పండుగ వేడుకలు హనుమకొండ లోని విశ్వవిద్యాలయ ఆర్ట్స్ అండ్ సైన్స్ కళాశాలలో ఘనంగా నిర్వహించారు. కళాశాల శతాబ్ది ఉత్సవాల్లో భాగంగా శుక్రవారం ప్రిన్సిపాల్ సుంకరి జ్యోతి ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ సంబరాల్లో తెలంగాణ రాష్ట్ర మహిళా కమిషన్ చైర్‌పర్సన్ నేరెళ్ల శారదతో కలిసి కాకతీయ పట్టణాభివృద్ధి సంస్థ చైర్‌పర్సన్, మాజీ రాజ్యసభ సభ్యురాలు, వరంగల్ మహానగర పాలక సంస్థ మాజీ మేయర్ గుండు సుధారాణి పాల్గొని బతుకమ్మ ఆడారు. అంతకుముందు నిర్వహించిన సమావేశంలో గుండు సుధారాణి ప్రసంగించారు. తెలంగాణ మహిళల జీవన విధానం, సంస్కృతి, సంప్రదాయాలను ప్రతిబింబించే బతుకమ్మ పండుగ విశిష్టతను చాటిచెప్పేలా వేడుకలు నిర్వహించారు. విద్యార్థినులు, అధ్యాపకులు ఉత్సాహంగా పాల్గొని పండుగ సందడిని మరింత పెంచారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర మహిళా అధ్యక్షురాలు ఎర్రబెల్లి స్వర్ణ, వరంగల్ పశ్చిమ ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి సతీమణి నాయిని నీలిమ, కాకతీయ విశ్వవిద్యాలయ రిజిస్ట్రార్ ప్రొఫెసర్ వి. రామచంద్రం, మహిళా కమిషన్ కార్యదర్శి పద్మజ, సభ్యురాలు రాధాబాయి, కార్యనిర్వాహక మండలి సభ్యులు అనితా రెడ్డి, రమ, అధ్యాపకులు, విద్యార్థినులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# ఆన్‌లైన్ పరిచయాలతో అప్రమత్తం.. యువత భవిష్యత్తును కాపాడుకోండి!

- సోషల్ మీడియా పరిచయాలతో బ్లాక్‌మెయిల్ చేసే ప్రమాదం
- సైబర్ నేరాలపై కుటుంబ సభ్యులకూ అవగాహన కల్పించాలి
- వరంగల్ పోలీస్ కమిషనర్ ఎన్. శ్వేత





**వరంగల్, అక్టోబర్ 09 (నిత్యం నిఘా) :** యువత సోషల్ మీడియాలో అపరిచిత వ్యక్తులతో పరిచయాలు పెంచుకొని మోసాల బారిన పడొద్దని వరంగల్ పోలీస్ కమిషనర్ ఎన్. శ్వేత సూచించారు. భావోద్వేగాలను అదుపులో ఉంచుకుంటూ, మంచి చెడుల మధ్య తేడాను గుర్తించి బాధ్యతాయుతంగా వ్యవహరించాలని పిలుపునిచ్చారు. డిజిటల్ యుగంలో సైబర్ నేరాల పట్ల ప్రతి ఒక్కరూ అప్రమత్తంగా ఉండాలని స్పష్టం చేశారు. జాతీయ సైబర్ భద్రత అవగాహన మాసోత్సవంలో భాగంగా శుక్రవారం భీమారంలోని ఎస్వీఎస్ కళాశాల ఆడిటోరియంలో వివిధ కళాశాలల విద్యార్థులకు అవగాహన సమావేశం నిర్వహించారు. ముఖ్య అతిథిగా హాజరైన సీపీ శ్వేత మాట్లాడుతూ.. దేశ భవిష్యత్తులో యువత కీలక పాత్ర పోషించాల్సి ఉందని, విద్యార్థి దశలో అలవర్చుకునే విలువలు, క్రమశిక్షణ భవిష్యత్తులో బాధ్యతాయుతమైన పౌరులుగా ఎదగడానికి దోహదపడతాయని పేర్కొన్నారు. సైబర్ నేరగాళ్లు సోషల్ మీడియా పరిచయాలను ఆసరాగా చేసుకొని వ్యక్తిగత వివరాలు, ఫొటోలు, ఇతర సమాచారాన్ని సేకరించి బాధితులను బ్లాక్‌మెయిల్ చేసే ప్రమాదం ఉందని హెచ్చరించారు. ఆన్‌లైన్‌లో పరిచయమైన అపరిచితులను గుడ్డిగా నమ్మవద్దని, వ్యక్తిగత సమాచారాన్ని వారితో పంచుకోవద్దని సూచించారు. ఏదైనా నిర్ణయం తీసుకునే ముందు ఆలోచించాలని, భావోద్వేగాలకు లోనుకాకుండా జాగ్రత్తగా వ్యవహరించాలని తెలిపారు. సైబర్ నేరాలపై యువతలో అవగాహన పెరగడంతోపాటు కుటుంబ సభ్యులకు కూడా అవగాహన కల్పించాలని సీపీ కోరారు. దసరా సెలవులను సద్వినియోగం చేసుకొని తల్లిదండ్రులు, బంధువులకు ఆన్‌లైన్ మోసాలపై వివరించాలని సూచించారు. ప్రతి ఒక్కరూ డిజిటల్ భద్రతా నియమాలు పాటిస్తూ సైబర్ నేరాల నివారణలో భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో సెంట్రల్ జోన్ డీసీపీ ధార కవిత, హనుమకొండ ఏసీపీ నరసింహారావు, సైబర్ క్రైమ్ ఏసీపీ వెంకటరమణ, కేయూసీ ఇన్‌స్పెక్టర్ రవికుమార్, సైబర్ క్రైమ్ ఇన్‌స్పెక్టర్ అశోక్, ఎస్ఐ శివకుమార్, ఎస్వీఎస్ కళాశాల అధ్యాపకులు, వివిధ కళాశాలల విద్యార్థులు పాల్గొన్నారు.

# భూ పునఃసర్వేపై కలెక్టర్ ప్రత్యేక దృష్టి



**వరంగల్/వర్ధన్నపేట, అక్టోబర్ 09 (నిత్యం నిఘా ప్రతినిధి) :** భూ పునఃసర్వే పనుల్లో నిర్లక్ష్యానికి తావులేకుండా, నిబంధనల ప్రకారం క్షేత్రస్థాయిలో పకడ్బందీగా సర్వే పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్య శారద అధికారులను ఆదేశించారు. వర్ధన్నపేట మండలం చెన్నారం గ్రామంలో కొనసాగుతున్న భూ పునఃసర్వే పనులను శుక్రవారం ఆమె క్షేత్రస్థాయిలో పరిశీలించి, పురోగతిపై సంబంధిత అధికారులను వివరాలు అడిగి తెలుసుకున్నారు.

**సర్వే పురోగతిపై ఆరా**

చెన్నారం గ్రామంలో ఇప్పటివరకు ఎంతమేర సర్వే పూర్తయింది, ప్రక్రియలో ఎలాంటి సమస్యలు ఎదురవుతున్నాయి, ఇంకా చేపట్టాల్సిన పనులు ఏమిటనే అంశాలపై కలెక్టర్ ఆరా తీశారు. క్షేత్రస్థాయిలో వాస్తవ పరిస్థితులను పరిగణనలోకి తీసుకొని, ప్రతి అంశాన్ని నిశితంగా పరిశీలిస్తూ సర్వే ప్రక్రియను నిబంధనలకు అనుగుణంగా నిర్వహించాలని సూచించారు.

**సమన్వయంతో పనులు పూర్తి చేయాలి**

భూ పునఃసర్వేలో క్షేత్రస్థాయి పరిశీలనకు ప్రాధాన్యమివ్వాలని, పనుల నిర్వహణలో పారదర్శకతతో పాటు కచ్చితత్వం పాటించాలని అధికారులకు దిశానిర్దేశం చేశారు. సంబంధిత శాఖల అధికారులు పరస్పర సమన్వయంతో పనిచేసి సర్వే కార్యక్రమాన్ని సజావుగా పూర్తి చేయాలని స్పష్టం చేశారు. ఈ పరిశీలనలో అదనపు కలెక్టర్ (రెవెన్యూ) ఎల్. కిషోర్ కుమార్, వరంగల్ ఆర్డీవో సుమ, వర్ధన్నపేట తహసీల్దార్ విజయ్ సాగర్, భూ రికార్డుల సహాయ సంచాలకుడు శ్రీనివాస్‌తో పాటు రెవెన్యూ అధికారులు, సర్వేయర్లు, ఇతర సిబ్బంది పాల్గొన్నారు.

# ప్రజాసేవే పోలీసుల పరమ ధ్యేయం

- ప్రజల సమస్యలకు సత్వర పరిష్కారం చూపాలి
- ములుగూరు పోలీస్ స్టేషన్ వార్షిక తనిఖీలో సీపీ ఎన్. శ్వేత





**హనుమకొండ, అక్టోబర్ 09 (నిత్యం నిఘా) :** ప్రజలకు మెరుగైన సేవలు అందిస్తూ వారి సమస్యలను సత్వరమే పరిష్కరించాలని వరంగల్ పోలీస్ కమిషనర్ ఎన్. శ్వేత సూచించారు. ప్రజాసేవ చేయడం పోలీసులకు దక్కిన గౌరవమని, ప్రజాసేవే పోలీసుల పరమ ధ్యేయమని పేర్కొన్నారు. వార్షిక తనిఖీలో భాగంగా శుక్రవారం ములుగూరు పోలీస్ స్టేషన్‌ను సీపీ శ్వేత తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఎస్సై ఎం. రాజు ఆధ్వర్యంలో పోలీసు సిబ్బంది ఆమెకు గౌరవ వందనం సమర్పించారు. అనంతరం పోలీస్ స్టేషన్‌లోని వివిధ రికార్డులు, కేసుల దర్యాప్తు పురోగతి, పెండింగ్ కేసులు, స్టేషన్ పరిసరాలు, సిబ్బంది విధుల నిర్వహణను క్షుణ్ణంగా పరిశీలించారు. అనంతరం పోలీసు అధికారులు, సిబ్బందితో సమావేశమైన సీపీ మాట్లాడుతూ.. గ్రామీణ ప్రాంతాల్లో ప్రజలు చిన్నచిన్న సమస్యలకు సైతం పోలీసులను ఆశ్రయిస్తారని, అలాంటి సమయంలో వారి సమస్యలను ఓపికగా విని న్యాయం జరిగేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. ప్రజలతో మర్యాదపూర్వకంగా వ్యవహరిస్తూ, వారి నమ్మకాన్ని పొందాలని తెలిపారు. ఫిర్యాదుల పరిష్కారంలో జాప్యం లేకుండా బాధ్యతాయుతంగా విధులు నిర్వహించాలని ఆదేశించారు. తనిఖీ అనంతరం పోలీస్ స్టేషన్ ఆవరణలో సీపీ మామిడి మొక్కను నాటారు. ఈ కార్యక్రమంలో సెంట్రల్ జోన్ డీసీపీ ధార కవిత, కాజీపేట ఏసీపీ పింగిలి ప్రశాంత్ రెడ్డి, ఎల్కతుర్తి సీఐ కె. శ్రీను, ములుగూరు ఎస్సై ఎం. రాజు, వంగర ఎస్సై దివ్య, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

# చిన్నారుల సంక్షేమం.. ఆరోగ్య సేవలపై ఐటీడీఏ పీఓ ప్రత్యేక దృష్టి

- అంగన్‌వాడీ కేంద్రం, ఆరోగ్య ఉపకేంద్రం తనిఖీ
- సిబ్బంది బాధ్యతగా విధులు నిర్వహించాలి : లెనిన్ వత్సల్ టోప్పో



**ఏటూరునాగారం, అక్టోబర్ 09 (నిత్యం నిఘా ప్రతినిధి) :** గిరిజన ప్రాంతాల్లో చిన్నారుల సంక్షేమం, పౌష్టికాహారం, ప్రాథమిక ఆరోగ్య సేవలను మెరుగుపరిచేందుకు ఐటీడీఏ ప్రత్యేక దృష్టి సారించింది. ఇందులో భాగంగా ఐటీడీఏ పీఓ లెనిన్ వత్సల్ టోప్పో శుక్రవారం చినబోయినపల్లిలోని అంగన్‌వాడీ కేంద్రం, ఆరోగ్య ఉపకేంద్రాన్ని సందర్శించి అక్కడి పరిస్థితులను పరిశీలించారు.మొదట అంగన్‌వాడీ కేంద్రాన్ని తనిఖీ చేసిన పీఓ.. చిన్నారులకు అందుబాటులో ఉన్న వసతులు, పౌష్టికాహార పంపిణీ ఏర్పాట్లు, కేంద్రం నిర్వహణ వివరాలను పరిశీలించారు. చిన్నారుల శారీరక, మానసిక ఎదుగుదలకు పౌష్టికాహారం, ప్రాథమిక విద్య, పరిశుభ్రమైన వాతావరణం ఎంతో అవసరమని పేర్కొన్నారు. అంగన్‌వాడీ సేవలు నాణ్యతతో అందేలా సిబ్బంది బాధ్యతాయుతంగా విధులు నిర్వహించాలని సూచించారు. అనంతరం ఆరోగ్య ఉపకేంద్రాన్ని సందర్శించి ఆరోగ్య రికార్డులు, మందుల నిల్వలు, వైద్య పరికరాలు, ప్రజలకు అందుతున్న సేవలను పరిశీలించారు. గర్భిణులు, బాలింతలు, చిన్నారులకు అవసరమైన వైద్య సేవలు సకాలంలో అందించాలని, మందుల లభ్యతపై నిరంతరం పర్యవేక్షణ ఉండాలని సూచించారు. ఆరోగ్య రికార్డులను సక్రమంగా నిర్వహిస్తూ ప్రజలకు మెరుగైన సేవలు అందించాలని తెలిపారు. గిరిజన ప్రాంతాల్లో ప్రభుత్వ సంక్షేమ, ఆరోగ్య సేవలు అర్హులైన ప్రజలకు సమర్థవంతంగా చేరేలా క్షేత్రస్థాయి పర్యటనలు చేపడుతున్నట్లు ఐటీడీఏ వర్గాలు పేర్కొన్నాయి. చిన్నారుల సంక్షేమం, ఆరోగ్య పరిరక్షణకు సంబంధిత శాఖల సిబ్బంది సమన్వయంతో పనిచేయాల్సిన అవసరం ఉందని ఈ పర్యటన ప్రాధాన్యతను చాటిచెప్పింది.

నిత్యం నిఘా
తెలుగు దినపత్రిక

# లిటిల్ ఫ్లవర్ పాఠశాలలో ముందస్తు బతుకమ్మ సంబరాలు

## విద్యార్థినుల బతుకమ్మల పోటీ.. విజేతలకు బహుమతులు

**వరంగల్, అక్టోబర్ 09 (నిత్యం నిఘా ప్రతినిధి) :** తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలకు ప్రతీకగా నిలిచే బతుకమ్మ పండుగను పురస్కరించుకొని వరంగల్‌లోని లిటిల్ ఫ్లవర్ పాఠశాలలో శుక్రవారం ముందస్తు బతుకమ్మ సంబరాలను ఘనంగా నిర్వహించారు. మూడో తరగతి నుంచి పదో తరగతి వరకు విద్యార్థులు రంగురంగుల పూలతో బతుకమ్మలను పేర్చి పాఠశాలకు తీసుకొచ్చారు. వేడుకల్లో భాగంగా ఉత్తమ బతుకమ్మలను ఎంపిక చేసి విజేతలకు పాఠశాల ప్రిన్సిపల్ బహుమతులు అందజేశారు.పోటీల్లో చింతకింది శ్రీకృతి (ఐదో తరగతి) ప్రథమ బహుమతి, ఈ. రియా (యూకేజీ) ద్వితీయ బహుమతి, మహి (మొదటి తరగతి) తృతీయ బహుమతి సాధించగా, సాన్వి (మొదటి తరగతి) ప్రోత్సాహక బహుమతి అందుకుంది. ఉపాధ్యాయులు, విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొని వేడుకలను విజయవంతం చేశారు.ఈ సందర్భంగా పాఠశాల కరస్పాండెంట్ శేర్ల అనిల్ కుమార్ మాట్లాడుతూ.. బతుకమ్మ పండుగ తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలకు ప్రతీకగా నిలుస్తుందని పేర్కొన్నారు. తొమ్మిది రోజులపాటు బతుకమ్మను పూజించి, పదో రోజు సద్దుల బతుకమ్మగా వేడుకలను నిర్వహించడం మన సంప్రదాయమని తెలిపారు. ప్రకృతిలో లభించే వివిధ రకాల పూలతో బతుకమ్మను పేర్చడం పర్యావరణ పరిరక్షణ ప్రాధాన్యతను తెలియజేస్తుంద



న్నారు. ఇలాంటి వేడుకల ద్వారా విద్యార్థులకు మన సంస్కృతి, సంప్రదాయాలపై అవగాహన పెరుగుతుందని చెప్పారు. కార్యక్రమంలో పాఠశాల కరస్పాండెంట్ శేర్ల రజిని, ఉపాధ్యాయులు తులసి, సాలెహా, బజ్జూరి రజిత, నుస్రత్, లూథియా, తస్లీమా, సుమలత, సాయి కృష్ణ, ప్రవీణ్ తదితరులు పాల్గొన్నారు. భారతీయ జనతా పార్టీ కరీమాబాద్ మండల అధ్యక్షుడు బోరిగం నాగరాజు, ఆ పార్టీ ఓబీసీ విభాగం వరంగల్ జిల్లా ప్రధాన కార్యదర్శి కర్నె రవీందర్ కూడా వేడుకల్లో పాల్గొన్నారు.

# విద్యుత్ కోతలపై బీజేపీ కిసాన్ మోర్చా ఆగ్రహం

- **తిమ్మాపురం సబ్‌స్టేషన్ వద్ద రైతులతో కలిసి ధర్నా**
- **కరెంట్ ఇవ్వకుంటే సీఎం ఇంటిని ముట్టడిస్తాం : బస్వాపురం నరసయ్య**
- **ఎండిన పంటలకు నష్టపరిహారం చెల్లించాలి : గంట రవికుమార్**

**వరంగల్, అక్టోబర్ 09 (నిత్యం నిఘా ప్రతినిధి) :** రాష్ట్రంలో వ్యవసాయ విద్యుత్ సరఫరా సక్రమంగా లేక రైతులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని బీజేపీ కిసాన్ మోర్చా రాష్ట్ర అధ్యక్షుడు బస్వాపురం నరసయ్య, వరంగల్ జిల్లా అధ్యక్షుడు గంట రవికుమార్ ఆరోపించారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి రాకముందు ఇచ్చిన హామీలకు, ప్రస్తుతం క్షేత్రస్థాయిలో పరిస్థితులకు పొంతన లేదని విమర్శించారు. రైతులకు నిరంతరాయంగా నాణ్యమైన విద్యుత్ సరఫరా చేయాలని డిమాండ్ చేస్తూ శుక్రవారం ఖమ్మం జాతీయ రహదారిపై తిమ్మాపురం విద్యుత్ ఉపకేంద్రం వద్ద బీజేపీ కిసాన్ మోర్చా ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు. ఆందోళనకారులను పోలీసులు అడ్డుకోవడంతో ఉద్రిక్తత నెలకొంది. పలువురు నాయకులను పోలీసులు అరెస్టు చేశారు. కిసాన్ మోర్చా రాష్ట్ర ఉపాధ్యక్షుడు మల్లాడి తిరుపతిరెడ్డి కార్యక్రమానికి సమన్వయకర్తగా వ్యవహరించగా, వరంగల్ జిల్లా అధ్యక్షుడు దండు కిషన్ ఆధ్వర్యంలో ధర్నా జరిగింది. బస్వాపురం నరసయ్య, గంట రవికుమార్, బీజేపీ జాతీయ కౌన్సిల్ సభ్యుడు గుజ్జుల ప్రేమేందర్ రెడ్డి, మాజీ ఎమ్మెల్యేలు మార్తనేని ధర్మారావు, కొండేటి శ్రీధర్ తదితరులు ముఖ్య అతిథులుగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా బస్వాపురం నరసయ్య మాట్లాడుతూ.. రైతులకు 24 గంటల ఉచిత విద్యుత్ అందిస్తామని చెప్పిన కాంగ్రెస్ ప్రభుత్వం కనీసం ఐదు నుంచి ఆరు గంటలపాటు కూడా నాణ్యమైన విద్యుత్ సరఫరా చేయలేకపోతోందని విమర్శించారు. విద్యుత్ కోతల కారణంగా బోర్ల కింద సాగు చేస్తున్న వరి పంటలు ఎండిపోతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. కాంగ్రెస్ ప్రభుత్వ విధానాల వల్ల రైతులు నష్టపోతున్నారని ఆరోపిస్తూ, తక్షణమే విద్యుత్ సరఫరాను మెరుగుపరచాలని డిమాండ్ చేశారు. సమస్య పరిష్కారం కాకపోతే ముఖ్యమంత్రి నివాసాన్ని ముట్టడిస్తామని హెచ్చరించారు. బీజేపీ వరంగల్ జిల్లా అధ్యక్షుడు గంట రవికుమార్ మాట్లాడుతూ.. జిల్లాలో విద్యుత్ సరఫరా అస్తవ్యస్తంగా మారడంతో చేతికొచ్చిన పంటలు ఎండిపోయే పరిస్థితి నెలకొందని ఆరోపించారు. విద్యుత్ కోతలతో నష్టపోయిన ప్రతి ఎకరా వరి పంటను అధికారులు క్షేత్రస్థాయిలో పరిశీలించి, బాధిత రైతులకు





ప్రభుత్వం నష్టపరిహారం చెల్లించాలని డిమాండ్ చేశారు. కిసాన్ మోర్చా రాష్ట్ర ఉపాధ్యక్షుడు మల్లాడి తిరుపతిరెడ్డి మాట్లాడుతూ.. వర్ధన్నపేట పరిసర ప్రాంతాల్లో రైతులు విద్యుత్ సమస్యలతో ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. విద్యుత్ కోతలపై అధికారులు తక్షణమే స్పందించి రైతులకు న్యాయం చేయాలని కోరారు. రైతుల సమస్యలు పరిష్కారమయ్యే వరకు బీజేపీ, కిసాన్ మోర్చా పోరాటం కొనసాగిస్తాయని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో బీజేపీ జాతీయ కిసాన్ మోర్చా కార్యవర్గ సభ్యుడు గోలి మధుసూదన్ రెడ్డి, మాజీ ఎమ్మెల్యేలు మార్తనేని ధర్మారావు, కొండేటి శ్రీధర్, జాతీయ కౌన్సిల్ సభ్యుడు గుజ్జుల ప్రేమేందర్ రెడ్డి, మాజీ మేయర్ డాక్టర్ టి. రాజేశ్వరరావు, కిసాన్ మోర్చా రాష్ట్ర ప్రధాన కార్యదర్శులు పడమట జగన్మోహన్ రెడ్డి, దేవర శీను, రాష్ట్ర ఉపాధ్యక్షులు నూతన కంటి శ్రీనివాస్ రెడ్డి, గంగారెడ్డి, యాదగిరిరావు, రాష్ట్ర అధికార ప్రతినిధి డాక్టర్ వన్నాల వెంకటరమణ, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు కుసుమ సతీష్, జలగం రంజిత్ రావు, సిద్ధం నరేష్, ముత్తిరెడ్డి కేశవ రెడ్డి, జిల్లా ప్రధాన కార్యదర్శులు బన్న ప్రభాకర్, గోగుల రాణా ప్రతాప్ రెడ్డి, మాదిరెడ్డి దేవేందర్ రెడ్డి, అమృత రావు, బీజేపీ పదాధికారులు, వివిధ మోర్చాల నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# పూల బతుకమ్మ.. ప్రకృతి పరిమళం!

**మంథని,అక్టోబర్ 09 (నిత్యం నిఘా ప్రతినిధి) :** తెలంగాణ సంస్కృతి సంప్రదాయాలకు, ప్రకృతిపై ప్రేమకు ప్రతీకగా నిలిచే బతుకమ్మ పండుగ సంబరాలు మంథని ప్రభుత్వ బాలికల డిగ్రీ కళాశాలలో ముందస్తుగా ఘనంగా నిర్వహించారు. సంప్రదాయ దుస్తుల్లో ముస్తాబైన విద్యార్థినులు వివిధ రకాల రంగురంగుల పూలతో అందమైన బతుకమ్మలను పేర్చి, వాటి చుట్టూ పాటలు పాడుతూ ఉత్సాహంగా నృత్యాలు చేశారు. కళాశాల అధ్యాపకులు, అధ్యాపకురాళ్లు కూడా వేడుకల్లో పాల్గొని విద్యార్థినులతో కలిసి పండుగ సందడిని పంచుకున్నారు. బతుకమ్మ పండుగ తెలంగాణ ఆడపడుచుల ఆత్మీయతకు, ప్రకృతితో మనిషికి ఉన్న అనుబంధానికి ప్రతీకగా నిలుస్తుంది. తంగేడు, గునుగు, బంతి, చామంతి వంటి రకరకాల పూలతో బతుకమ్మలను పేర్చి గౌరీదేవిని పూజించడం ఈ పండుగ ప్రత్యేకత. తొమ్మిది రోజులపాటు వివిధ రూపాల్లో కొనసాగుతున్న ఈ సంబరాలు మహిళల్లో ఐక్యతను పెంపొందించడంతోపాటు కుటుంబ శ్రేయస్సు, సుఖసంతోషాల కోసం ప్రార్థించే ఆధ్యాత్మిక వేడుకగా నిలుస్తాయి.

**సంప్రదాయాల పరిరక్షణలో విద్యాసంస్థల పాత్ర**

విద్యతోపాటు సంస్కృతి, సంప్రదాయాలపై విద్యార్థినులకు అవగా



హన కల్పించాలనే ఉద్దేశంతో నిర్వహించిన ఈ వేడుకలు కళాశాల ప్రాంగణానికి పండుగ శోభను తీసుకొచ్చాయి. పూలను పేర్చడం నుంచి బతుకమ్మ పాటలు పాడటం వరకు విద్యార్థినులు ఉత్సాహంగా పాల్గొన్నారు. తెలంగాణ సంస్కృ–తిలో అంతర్భాగమైన బతుకమ్మ సంప్రదాయాన్ని భావితరాలకు అందించడంలో ఇలాంటి కార్యక్రమాలు దోహదపడతాయి. ప్రకృతిని గౌరవిస్తూ, సంప్రదాయాలను కాపాడుకుంటూ ఐకమత్యంతో పండుగలను జరుపుకోవాలనే సందేశాన్ని ఈ వేడుకలు చాటిచెప్పాయి.

# దసరా వేళ ఇసుక లారీల రాకపోకలు నిలిపివేయాలి !

## ప్రజల భద్రత దృష్ట్యా మంగపేట మండల ప్రజల వినతి





**ములుగు జిల్లా/మంగపేట, అక్టోబర్ 09(నిత్యం నిఘా ప్రతినిధి) :** దసరా నవరాత్రుల సందర్భంగా ప్రజల భద్రతను దృష్టిలో ఉంచుకొని మంగపేట మండలంలో ఇసుక లారీల రాకపోకలను తాత్కాలికంగా నిలిపివేయాలని మండల ప్రజలు కోరారు. ఈ మేరకు గురువారం మంగపేట పోలీసు ఉపనిరీక్షకుడికి, తహసీల్దార్‌కు వినతిపత్రం సమర్పించారు. మంగపేట మండల ప్రజలతో పాటు జ్వాలా చారిటబుల్ ట్రస్ట్ ప్రతినిధులు ఈ విజ్ఞప్తి చేశారు.ఈ నెల 10 నుంచి 21వ తేదీ వరకు దసరా పండుగ సెలవుల నేపథ్యంలో ప్రజలు కుటుంబాలతో కలిసి స్వగ్రామాలకు, ఇతర ప్రాంతాలకు ప్రయాణాలు చేసే అవకాశం ఉందని వినతిపత్రంలో పేర్కొన్నారు. పాఠశాలలు, కళాశాలలకు సెలవులు ఉండటంతో ప్రధాన రహదారులపై వాహనాల రద్దీ పెరిగే అవకాశముందని తెలిపారు. ఇలాంటి సమయంలో ఇసుక లారీల రాకపోకలు కొనసాగితే ప్రమాదాల ముప్పు పెరిగే అవకాశం ఉందని ఆందోళన వ్యక్తం చేశారు. ఇటీవల రహదారులపై తరచూ ప్రమాదాలు చోటుచేసుకుంటున్న నేపథ్యంలో ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలని కోరారు. మహిళలు, చిన్నపిల్లలు, వృద్ధులు సహా పండుగ ప్రయాణాలు చేసే ప్రజల భద్రతకు ప్రాధాన్యం ఇవ్వాలని విజ్ఞప్తి చేశారు. గ్రామస్తులతో చర్చించిన అనంతరం ప్రజల భద్రత కోసం పండుగ రోజుల్లో ఇసుక లారీల రాకపోకలతో పాటు ఇసుక లోడింగ్, రవాణాను తాత్కాలికంగా నిలిపివేయాలని నిర్ణయించినట్లు తెలిపారు. ఈ నెల 10 నుంచి 21వ తేదీ వరకు ఇసుక రవాణా నిలిపివేసేలా సంబంధిత అధికారులు చర్యలు తీసుకోవాలని వినతిపత్రం ద్వారా కోరారు.

# కరెంటు, నీళ్లు ఇవ్వకపోతే సబ్‌స్టేషన్ల ముట్టడి !

## రైతుల పంటలు కాపాడే వరకు పోరాటం ఆగదు




**మంథని, అక్టోబర్ 09(నిత్యం నిఘా ప్రతినిధి) :** వ్యవసాయానికి సరిపడా విద్యుత్ సరఫరా చేయడంతో పాటు ఎస్సారెస్పీ నీటిని వెంటనే విడుదల చేయాలని, లేని పక్షంలో విద్యుత్ ఉపకేంద్రాలను ముట్టడిస్తామని మంథని మాజీ ఎమ్మెల్యే పుట్ట మధూకర్ హెచ్చరించారు. రైతుల పంటలను కాపాడే వరకు పోరాటాన్ని ఆపబోమని స్పష్టం చేశారు. అప్రకటిత విద్యుత్ కోతలు, ఎస్సారెస్పీ నీటి విడుదలలో జాప్యంతో పంటలు ఎండిపోతున్నాయని ఆరోపిస్తూ శుక్రవారం మంథనిలోని పాత పెట్రోల్ బంక్ సమీపంలో రైతులు, బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలతో కలిసి మంథని–కాటారం ప్రధాన రహదారిపై రాస్తారోకో నిర్వహించారు. సుమారు గంటపాటు సాగిన ఆందోళనతో రహదారిపై కిలోమీటరు మేర వాహనాలు నిలిచిపోయాయి. ఈ సందర్భంగా పుట్ట మధూకర్ మాట్లాడుతూ.. రైతులు ఇప్పటికే పంటల సాగు కోసం భారీగా పెట్టుబడులు పెట్టారని, ప్రస్తుతం వరి పంట పొట్ట దశకు చేరుకున్న సమయంలో విద్యుత్ సరఫరా సరిగా లేక బోర్లు పనిచేయడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. నీరందక పంటలు ఎండిపోయే పరిస్థితి ఏర్పడిందని అన్నారు. వ్యవసాయానికి 24 గంటల విద్యుత్ సరఫరా చేస్తామని హామీ ఇచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం ఆ హామీని నిలబెట్టుకోవడం లేదని విమర్శించారు. రైతుల సమస్యలను పరిష్కరించాల్సిన మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు ఇతర కార్యక్రమాలతో కాలయాపన చేస్తున్నారని ఆయన ఆరోపించారు. రైతుల కష్టాలు, ప్రజల సమస్యలను ప్రభుత్వం పట్టించుకోవడం లేదని విమర్శించారు. ప్రజల పక్షాన పోరాడితే కేసులు నమోదు చేస్తున్నారని, ఎన్ని కేసులు పెట్టినా, ఎలాంటి నిర్బంధాలు ఎదురైనా బీఆర్ఎస్ ప్రజల తరఫున పోరాటాన్ని కొనసాగిస్తుందని స్పష్టం చేశారు. విద్యుత్ అవసరాలు పెరిగే అవకాశం ఉందని తెలిసినా ప్రభుత్వం ముందస్తు చర్యలు తీసుకోలేదని పుట్ట మధూకర్ విమర్శించారు. పంటలకు నీరు అందకపోతే రైతులు తీవ్రంగా నష్టపోయే ప్రమాదం ఉందని ఆందోళన వ్యక్తం చేశారు. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి వ్యవసాయానికి నిరంతర విద్యుత్ సరఫరా చేయాలని, ఎస్సారెస్పీ నీటిని విడుదల చేసి పంటలను కాపాడాలని డిమాండ్ చేశారు. రైతుల సమస్యలను పరిష్కరించకపోతే ఆందోళనలను మరింత ఉధృతం చేస్తామని హెచ్చరించారు.

నిత్యం నిఘా
తెలుగు దినపత్రిక

# చర్ల ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఘనంగా నూతన విద్యార్థుల వేడుకలు




**భద్రాద్రి కొత్తగూడెం జిల్లా / చర్ల, అక్టోబర్ 9(నిత్యం నిఘా ప్రతినిధి) :** చర్ల ప్రభుత్వ జూనియర్ కళాశాలలో శుక్రవారం నూతన విద్యార్థుల స్వాగత వేడుకలను ఘనంగా నిర్వహించారు. కళాశాల ప్రిన్సిపాల్ ఎన్. నరేందర్ అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమానికి జిల్లా ఇంటర్మీడియట్ విద్యాధికారి, నోడల్ అధికారి హెచ్. వెంకటేశ్వరరావు ముఖ్య అతిథిగా హాజరయ్యారు.ఈ సందర్భంగా హెచ్. వెంకటేశ్వరరావు మాట్లాడుతూ విద్యార్థులు ఇప్పటి నుంచే ప్రణాళికాబద్ధంగా కష్టపడి చదివి వార్షిక పరీక్షల్లో అత్యుత్తమ ఫలితాలు సాధించాలని సూచించారు. ఆధునిక విద్యా సాంకేతికతను సద్వినియోగం చేసుకోవాలని, కృత్రిమ మేధ సహాయంతో విషయ పరిజ్ఞానాన్ని పెంపొందించుకోవాలని తెలిపారు. క్రమం తప్పకుండా కళాశాలకు హాజరవుతూ చదువుపై దృష్టి సారించినప్పుడే విద్యార్థులకు సమగ్ర వికాసం సాధ్యమవుతుందని పేర్కొన్నారు.మరో ముఖ్య అతిథి, మండల పరిషత్ అభివృద్ధి అధికారి ఈదయ్య మాట్లాడుతూ చర్ల మండలానికి చెందిన పలువురు పట్టుదలతో చదివి ఉన్నత స్థానాలకు చేరుకున్నారని గుర్తుచేశారు. వారిని ఆదర్శంగా తీసుకొని విద్యార్థులు లక్ష్యాలను నిర్దేశించుకుని ముందుకు సాగాలని, తమ ప్రతిభతో చర్ల ప్రాంతానికి మంచి గుర్తింపు తీసుకురావాలని పిలుపునిచ్చారు. కళాశాల ప్రిన్సిపాల్ ఎన్. నరేందర్ మాట్లాడుతూ విద్యార్థులు చదువులో సరైన పద్ధతులు పాటిస్తూ క్రమశిక్షణతో కూడిన జీవనశైలిని అలవర్చుకోవాలని సూచించారు. విద్యార్థి దశలోనే మంచి అలవాట్లను పెంపొందించుకుంటూ భవిష్యత్తుకు పునాది వేసుకోవాలని హితవు పలికారు.అనంతరం విద్యార్థులు ప్రదర్శించిన సాంస్కృతిక కార్యక్రమాలు, నృత్యాలు ఆహూతులను విశేషంగా ఆకట్టుకున్నాయి. ఈ వేడుకల్లో కళాశాల అధ్యాపకులు, అధ్యాపకేతర సిబ్బంది, విద్యార్థినీ విద్యార్థులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# అన్నారం దర్గాలో మహిళా భక్తుల కోసం ప్రత్యేక మసీదు



**పర్వతగిరి, అక్టోబర్ 09 (నిత్యం నిఘా ప్రతినిధి) :** వరంగల్ జిల్లా పర్వతగిరి మండలం అన్నారం గ్రామంలోని హజ్రత్ సయ్యద్ యాకూబ్ షావలి బాబా దర్గాకు వచ్చే మహిళా భక్తులు నమాజ్ చేసుకునేందుకు ప్రత్యేకంగా మసీదును నిర్మించారు. చెన్నారావుపేట మండలం ఉప్పరపల్లి గ్రామానికి చెందిన షేక్ బందే అలీ సుమారు రూ.15 లక్షల సొంత నిధులతో ఈ నిర్మాణాన్ని చేపట్టారు. శుక్రవారం మసీదును ప్రారంభించి అనంతరం వక్ఫ్ బోర్డు అధికారులకు అప్పగించారు.ఈ సందర్భంగా షేక్ బందే అలీ మాట్లాడుతూ వందల ఏళ్ల చరిత్ర కలిగిన అన్నారం దర్గాకు దేశంలోని వివిధ ప్రాంతాల నుంచి భక్తులు వస్తుంటారని తెలిపారు. దర్గాను సందర్శించే మహిళా భక్తులు ప్రత్యేకంగా నమాజ్ చేసుకునేందుకు ప్రార్థనా మందిరం నిర్మించాలనే ఆలోచన తనకు పదేళ్లుగా ఉందని, నేడు ఆ కోరిక నెరవేరడం ఆనందంగా ఉందని పేర్కొన్నారు.మహిళా భక్తులకు ప్రార్థనలు చేసుకునేందుకు మెరుగైన సౌకర్యం కల్పించాలనే ఉద్దేశంతో సొంత ఖర్చులతో మసీదును నిర్మించినట్లు తెలిపారు. ఈ నిర్మాణంతో దర్గాకు వచ్చే మహిళా భక్తులకు ప్రత్యేక ప్రార్థనా సౌకర్యం అందుబాటులోకి వచ్చిందని పలువురు హర్షం వ్యక్తం చేశారు.ఈ కార్యక్రమంలో వక్ఫ్ బోర్డు ఇన్స్పెక్టర్ రియాజ్, గ్రామ సర్పంచ్ గాడిపెల్లి మహేందర్, నయా సదర్ సాబ్ సద్దాం ఖాన్, గ్రామ ప్రముఖులు, పాలకవర్గ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

# పాలకుర్తి సోమేశ్వరుడి హుండీ ఆదాయం రూ.21.98 లక్షలు

- **200 రోజుల కానుకల లెక్కింపు పూర్తి..**
  **బంగారం, వెండి, విదేశీ కరెన్సీ సమర్పణ**



**జనగాం జిల్లా / పాలకుర్తి, అక్టోబర్ 09 (నిత్యం నిఘా ప్రతినిధి) :** జనగామ జిల్లా పాలకుర్తిలోని శ్రీ సోమేశ్వర లక్ష్మీనరసింహస్వామి ఆలయ హుండీ ఆదాయం రూ.21,98,507 సమకూరినట్లు ఆలయ కార్యనిర్వహణాధికారి భాగం లక్ష్మి ప్రసన్న తెలిపారు. 2026 మార్చి 24 నుంచి అక్టోబర్ 9 వరకు భక్తులు సమర్పించిన కానుకలను శుక్రవారం ఆలయ కల్యాణ మండపంలో లెక్కించారు. వల్మిడి శ్రీ సీతారామ చంద్రస్వామి ఆలయ కార్యనిర్వహణాధికారి వెంకట్‌రెడ్డి పర్యవేక్షణలో హుండీ లెక్కింపు నిర్వహించారు. నగదుతో పాటు 5 గ్రాముల 580 మిల్లీగ్రాముల మిశ్రమ బంగారం, ఒక కిలో 359.740 గ్రాముల మిశ్రమ వెండి లభించినట్లు అధికారులు వెల్లడించారు. విదేశీ కరెన్సీలో 230 అమెరికా డాలర్లు, 30 బ్రిటిష్ పౌండ్లు, 150 నేపాల్ రూపాయలు వచ్చినట్లు తెలిపారు. హుండీ లెక్కింపు కార్యక్రమంలో ఆలయ అర్చకులు, సిబ్బంది, శ్రీ సోమేశ్వర–రాజరాజేశ్వరి సేవా ట్రస్ట్ సభ్యులు, తెలంగాణ గ్రామీణ వికాస్ బ్యాంకు సిబ్బంది, స్థానిక పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.



# బతుకమ్మ వేళ మహిళలకు చిలకపచ్చ కానుక

**పెద్దపల్లి జిల్లా/ మంథని, అక్టోబర్ 09 (నిత్యం నిఘా ప్రతినిధి) :** బతుకమ్మ పండుగ సందర్భంగా రాష్ట్రంలోని మహిళలకు ప్రభుత్వం చిలకపచ్చ రంగు చీరలను కానుకగా అందించేందుకు ఏర్పాట్లు చేస్తోంది. ఇందిరా మహిళా శక్తి పథకంలో భాగంగా మహిళా సంఘాల సభ్యులకు ఈ చీరలను పంపిణీ చేయనున్నారు. పండుగకు ముందుగానే జిల్లాలకు చీరల సరఫరా ప్రారంభమైంది. ఇప్పటికే పెద్దపల్లి జిల్లాకు సగం చీరలు చేరుకోగా, మిగిలినవి త్వరలోనే చేరనున్నట్లు అధికారులు తెలిపారు. సద్దుల బతుకమ్మకు రెండు రోజుల ముందుగానే మహిళలకు చీరలు అందించేలా జిల్లా యంత్రాంగం ఏర్పాట్లు చేస్తోంది. పండుగ వేళ మహిళలకు కానుక అందించడంతోపాటు చేనేత రంగానికి చేయూతనివ్వడమే ఈ కార్యక్రమం ఉద్దేశంగా ప్రభుత్వం పేర్కొంటోంది. ఇటీవల రాజన్న సిరిసిల్ల జిల్లా కలెక్టరేట్‌లో ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్, చేనేత జౌళి శాఖ ముఖ్య కార్యదర్శి శైలజా రామయ్యర్, జిల్లా కలెక్టర్ గరిమా అగర్వాల్ నూతన చీరలను ఆవిష్కరించారు. సిరిసిల్లలోని 130 మరమగ్గాల సహకార సంఘాలకు ఏడు కోట్ల మీటర్ల వస్త్రం, కోటి చీరల ఉత్పత్తికి సంబంధించిన ఆర్డర్లు అందించినట్లు అధికారులు వెల్లడించారు.

### చేనేత కార్మికులకు ఉపాధి భరోసా

రాష్ట్రంలోని కోటి మంది మహిళలకు కోటి చీరలు అందించడమే లక్ష్యమని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ప్రకటించారు. భారీ స్థాయిలో చీరల తయారీకి ఆర్డర్లు ఇవ్వడం ద్వారా సిరిసిల్ల చేనేత కార్మికులకు ఆరు నుంచి ఏడు నెలల పాటు ఉపాధి లభించే అవకాశం ఉందని అధికారులు తెలిపారు. చీరల తయారీలో నాణ్యత విషయంలో రాజీ పడకుండా చర్యలు తీసుకుంటున్నట్లు స్పష్టం చేశారు. బతుకమ్మ పండుగ కానుకగా మహిళలకు చీరలు అందించడంతో పాటు చేనేత కార్మికుల జీవనోపాధికి తోడ్పడేలా ఈ కార్యక్రమాన్ని చేపట్టినట్లు పేర్కొన్నారు.



# అభ్యాస హైస్కూల్‌లో ఘనంగా బతుకమ్మ సంబరాలు

**వరంగల్, అక్టోబర్ 09 ( నిత్యం నిఘా ప్రతినిధి) :** తెలంగాణ ఆడపడుచుల ఆత్మీయతకు, ప్రకృతి ఆరాధనకు ప్రతీకగా నిలిచే బతుకమ్మ పండుగ వేడుకలను వరంగల్ నగరంలోని గణేష్‌నగర్ అభ్యాస హైస్కూల్‌లో ఘనంగా నిర్వహించారు. గ్రేటర్ వరంగల్ మున్సిపల్ కార్పొరేషన్ 43వ డివిజన్ పరిధిలోని పాఠశాలలో జరిగిన ఈ వేడుకలకు కరస్పాండెంట్ మీర్జా అఖిల్ ఉల్లా బేగ్ ముఖ్య అతిథిగా హాజరై ఆరు అడుగుల బతుకమ్మను ప్రారంభించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బతుకమ్మ తెలంగాణ ఆడపడుచులకు కొంగుబంగారమని, తరతరాలుగా వస్తున్న సంస్కృతి, సంప్రదాయాలను భావితరాలకు అందించడంలో విద్యాసంస్థల పాత్ర కీలకమని అన్నారు. విద్యార్థుల్లో దాగి ఉన్న ప్రతిభను వెలికితీయడం పాఠశాల బాధ్యతని పేర్కొన్నారు. వివిధ రకాల పూలతో బతుకమ్మను అందంగా పేర్చడం ఒక కళ అని, ప్రతి రంగు, ప్రతి పువ్వు ప్రత్యేకతను గుర్తిస్తూ సృజనాత్మకంగా అలంకరించడం విద్యార్థుల్లో ఆలోచనా శక్తిని పెంపొందిస్తుందని తెలిపారు. బతుకమ్మ పండుగ తెలంగాణకే పరిమితం కాకుండా దేశవిదేశాల్లోనూ గుర్తింపు పొందడం ఆనందంగా ఉందని పేర్కొంటూ వేడుకల నిర్వహణకు కృషి చేసిన పాఠశాల యాజమాన్యాన్ని అభినందించారు.పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు మండల శిరీష మాట్లాడుతూ బతుకమ్మ తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలకు ప్రతీక అని అన్నారు. ప్రకృతిలో లభించే తంగేడు, గునుగు, సీతజడ, బంతి, చామంతి, కట్ల, మందార వంటి పూలతో బతుకమ్మలను పేర్చడం విద్యార్థుల్లో సృజనాత్మకతను పెంపొందిస్తుందని తెలిపారు. ఇలాంటి కార్యక్రమాలు విద్యార్థులను సాంస్కృతిక విలువలతో పాటు జీవితంలో ఉన్నత స్థాయికి చేరుకునేలా తీర్చిదిద్దేందుకు దోహదపడతాయని పేర్కొన్నారు.విశ్రాంత శారీరక విద్యా ఉపాధ్యాయుడు చీకటి సమ్మయ్య మాట్లాడుతూ అభ్యాస హైస్కూల్‌లో బతుకమ్మ వేడుకలను ఇంత ఘనంగా నిర్వహించడం సంతోషంగా ఉందన్నారు. విద్యార్థినులు సంప్రదాయ దుస్తులు ధరించి, అందమైన బతుకమ్మలతో పాఠశాలకు రావడం వేడుకలకు మరింత శోభను తెచ్చిందని అన్నారు.పాఠశాల ఇన్‌చార్జి కోల రాము మాట్లాడుతూ బతుకమ్మ ప్రకృతిని ఆరాధిస్తూ ప్రజలంతా సుఖ సంతోషాలతో జీవించాలని కోరుకునే పండుగ అని పేర్కొన్నారు. ప్రతి పండుగ వెనుక ఉన్న సంస్కృతి, సంప్రదాయాలు, విలువలను విద్యార్థులకు పరిచయం చేయడం అభ్యాస హైస్కూల్ ఆనవాయితీ అని తెలిపారు.అనంతరం విద్యార్థినులు సంప్రదాయ దుస్తుల్లో బతుకమ్మ ఉయ్యాల పాటలతో అలరించారు. వివిధ రకాల పూలతో అందంగా బతుకమ్మలను పేర్చి తమ ప్రతిభను చాటుకున్నారు. ఉత్తమంగా బతుకమ్మలను అలంకరించిన విద్యార్థినులను పాఠశాల యాజమాన్యం అభినందించి బహుమతులు అందజేసింది. కార్యక్రమానికి ఇబహ ఇరామ్ వ్యాఖ్యాతగా వ్యవహరించి ఆకట్టుకున్నారు. ఉపాధ్యాయులు రజినీ, భారతి, సృజన, స్రవంతి, స్వాతి, కవిత, సుమయా, రజిత, ప్రణయ్‌తో పాటు విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.




# ఈత చెట్టుపై నుంచి పడి గౌడ కార్మికుడికి తీవ్ర గాయం

**పెద్దపల్లి జిల్లా / మంథని, అక్టోబర్ 09 (నిత్యం నిఘా ప్రతినిధి) :** కుటుంబ పోషణ కోసం నిత్యం ప్రాణాలను పణంగా పెట్టి ఈత చెట్లు ఎక్కే గౌడ కార్మికుల జీవితాలకు భద్రత కరువవుతోందని, ప్రమాదాలకు గురై మంచాన పడితే వారి కుటుంబాలను ఆదుకునే బాధ్యత ప్రభుత్వానిదేనని మంథని గౌడ సంఘం పెద్దలు పేర్కొన్నారు. ప్రమాదంలో తీవ్రంగా గాయపడి చికిత్స పొందుతున్న గౌడ కార్మికుడు వంగల ప్రవీణ్ గౌడ్‌ను ప్రభుత్వం తక్షణమే ఆదుకోవాలని విజ్ఞప్తి చేశారు. పెద్దపల్లి జిల్లా మంథని మండలం సూరయ్యపల్లికి చెందిన వంగల ప్రవీణ్ గౌడ్ (42) శుక్రవారం మధ్యాహ్నం 2.20 గంటల సమయంలో ఈత చెట్టు ఎక్కుతుండగా అరేన్ తాడు తెగిపోవడంతో ప్రమాదవశాత్తు కిందపడిపోయాడు. ఈ ఘటనలో ఆయన వెన్నుముకకు తీవ్ర గాయమైంది. వెంటనే కుటుంబ సభ్యులు ప్రవీణ్‌ను మంథని ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. పరీక్షించిన వైద్యులు మెరుగైన చికిత్స కోసం కరీంనగర్ ఆసుపత్రికి తీసుకెళ్లాలని సూచించారు. రోజువారీ కష్టంతో కుటుంబాన్ని పోషించే కార్మికుడికి ఇలాంటి ప్రమాదం ఎదురైతే ఆ కుటుంబం ఆర్థికంగా తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొనే పరిస్థితి నెలకొంటుంది. ఒకవైపు వైద్య ఖర్చులు, మరోవైపు కుటుంబ పోషణ భారంగా మారుతాయి. ప్రాణాలకు ముప్పు ఉందని తెలిసినా జీవనోపాధి కోసం ఈత చెట్లు ఎక్కే గౌడ కార్మికులకు ప్రమాద సమయంలో తగిన వైద్యసాయం, ఆర్థిక భరోసా కల్పించాల్సిన అవసరం ఉందని సంఘం పెద్దలు అభిప్రాయపడ్డారు.

### ప్రభుత్వం తక్షణమే స్పందించాలి

వంగల ప్రవీణ్ గౌడ్‌కు ప్రభుత్వం వెంటనే ఆర్థిక సహాయం అందించాలని, మెరుగైన వైద్యం పొందేందుకు అవసరమైన తోడ్పాటు కల్పించాలని మంథని గౌడ సంఘం పెద్దలు కోరారు. గౌడ కార్మికుల భద్రతకు ప్రత్యేక చర్యలు తీసుకోవడంతోపాటు, ప్రమాదాలకు గురైన కార్మికుల కుటుంబాలను ఆదుకునేలా ప్రభుత్వం ముందుకు రావాలని విజ్ఞప్తి చేశారు.కుటుంబాల జీవనాధారం కోసం ప్రమాదకర పరిస్థితుల్లో పనిచేసే గౌడ కార్మికుల ప్రాణాలకు భద్రత కల్పించడంతోపాటు, ప్రమాదం జరిగినప్పుడు బాధిత కుటుంబాలు దిక్కుతోచని స్థితిలో పడకుండా ప్రభుత్వం భరోసా ఇవ్వాలని వారు కోరుతున్నారు.



నిత్యం నిఘా
తెలుగు దినపత్రిక

# రాష్ట్రస్థాయి క్రీడలకు అన్నారం పల్లవి విద్యార్థినులు

**పర్వతగిరి, అక్టోబర్ 09 ( నిత్యం నిఘా ప్రతినిధి) :** వరంగల్ జిల్లా పర్వతగిరి మండలం అన్నారం గ్రామంలోని పల్లవి హైస్కూల్ విద్యార్థినులు క్రీడల్లో సత్తా చాటారు. జోనల్, జిల్లా స్థాయిల్లో నిర్వహించిన నెట్‌బాల్, సాఫ్ట్‌బాల్ పోటీల్లో ప్రతిభ కనబరిచి ఐదుగురు విద్యార్థినులు రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికయ్యారు. గ్రామీణ ప్రాంతానికి చెందిన విద్యార్థినులు రాష్ట్రస్థాయికి ఎదగడంపై పాఠశాల యాజమాన్యం, ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు, గ్రామస్తులు హర్షం వ్యక్తం చేశారు.



### నెట్‌బాల్‌లో ముగ్గురికి అవకాశం

కొమురం భీం ఆసిఫాబాద్ జిల్లాలో ఈ నెల 10, 11, 12 తేదీల్లో జరగనున్న రాష్ట్రస్థాయి నెట్‌బాల్ పోటీలకు ఏడో తరగతి విద్యార్థినులు బి. వక్షిత, బి. అమృత, సీహెచ్. శ్రీవిద్య ఎంపికయ్యారు. జోనల్, జిల్లా స్థాయి పోటీల్లో తమ ఆటతీరుతో ఆకట్టుకున్న ఈ విద్యార్థినులు రాష్ట్రస్థాయిలోనూ ప్రతిభను చాటేందుకు సిద్ధమయ్యారు.

### సాఫ్ట్‌బాల్‌లో ఇద్దరు ఎంపిక

నిజామాబాద్ జిల్లాలో ఈ నెల 11, 12 తేదీల్లో నిర్వహించనున్న మినీ సబ్ జూనియర్ రాష్ట్రస్థాయి సాఫ్ట్‌బాల్ పోటీలకు ఏడో తరగతి విద్యార్థినులు డి.ఎస్. సింధు, జి. నందిని ఎంపికయ్యారు. క్రమశిక్షణతో సాధన చేస్తూ రాష్ట్రస్థాయికి చేరుకున్న వీరు పతకాలు సాధించాలని పాఠశాల యాజమాన్యం ఆకాంక్షించింది.

### గ్రామీణ క్రీడాకారులను ప్రోత్సహిస్తాం: చైర్మన్ అశోక్ చారి

పాఠశాల చైర్మన్ రాచకొండ అశోక్ చారి మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతాల్లో ఎంతోమంది ప్రతిభావంతులైన క్రీడాకారులు ఉన్నారని, వారికి సరైన శిక్షణ, అవకాశాలు కల్పిస్తే ఉన్నత స్థాయికి ఎదుగుతారని అన్నారు. తమ పాఠశాల విద్యార్థినులు రాష్ట్రస్థాయికి ఎంపిక కావడం గర్వకారణమని పేర్కొన్నారు. పాఠశాల కరస్పాండెంట్ గంజి మహేందర్ మాట్లాడుతూ విద్యార్థులు చదువుతోపాటు క్రీడల్లోనూ రాణించాలని సూచించారు. క్రీడలు ఆత్మవిశ్వాసం, పట్టుదల, క్రమశిక్షణ, నాయకత్వ లక్షణాలను పెంపొందిస్తాయని తెలిపారు. రాష్ట్రస్థాయి పోటీల్లో పతకాలు సాధించి పాఠశాలకు, అన్నారం గ్రామానికి, వరంగల్ జిల్లాకు మంచి పేరు తీసుకురావాలని ఆకాంక్షించారు. పాఠశాల డైరెక్టర్ కోటగిరి రమేష్ మాట్లాడుతూ క్రీడలు శారీరక దృఢత్వంతోపాటు మానసిక వికాసానికి, జట్టుగా పనిచేసే సామర్థ్యానికి దోహదపడతాయని అన్నారు. విద్యార్థినుల విజయానికి వారి నిరంతర సాధనతోపాటు తల్లిదండ్రులు, క్రీడా ఉపాధ్యాయుల ప్రోత్సాహం కూడా కారణమని పేర్కొన్నారు. భవిష్యత్తులో మరింత మంది విద్యార్థులు జాతీయస్థాయికి ఎదిగేలా కృషి చేస్తామని తెలిపారు. ప్రిన్సిపాల్ మేకల అశ్విని మాట్లాడుతూ విద్యార్థులు చదువుతోపాటు క్రీడలు, సాంస్కృతిక కార్యక్రమాల్లో చురుగ్గా పాల్గొనాలని సూచించారు. రాష్ట్రస్థాయికి ఎంపికైన విద్యార్థినులు ఇతరులకు ఆదర్శంగా నిలిచారని పేర్కొన్నారు.

### క్రీడా ఉపాధ్యాయులకు అభినందనలు

విద్యార్థినులకు శిక్షణ అందించి రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికయ్యేలా కృషి చేసిన పాఠశాల శారీరక విద్యా ఉపాధ్యాయుడు శ్రవణ్ కుమార్, క్రీడా కోచ్ కవితను యాజమాన్యం అభినందించింది. ఈ కార్యక్రమంలో చైర్మన్ రాచకొండ అశోక్ చారి, కరస్పాండెంట్ గంజి మహేందర్, డైరెక్టర్ కోటగిరి రమేష్, ప్రిన్సిపాల్ మేకల అశ్విని, సమన్వయకర్తలు రాజు, నవ్యశ్రీ, వకుళాదేవి, ఉపాధ్యాయులు, బోధనేతర సిబ్బంది పాల్గొన్నారు. రాష్ట్రస్థాయికి ఎంపికైన ఐదుగురు విద్యార్థినులకు అభినందనలు తెలిపి, పోటీల్లో విజయాలు సాధించాలని ఆకాంక్షించారు.

# అన్నారం పల్లవి హైస్కూల్‌లో ముందస్తు బతుకమ్మ సంబరాలు

**వరంగల్ జిల్లా, పర్వతగిరి, అక్టోబర్ 09 (నిత్యం నిఘా ప్రతినిధి):** వరంగల్ జిల్లా పర్వతగిరి మండలం అన్నారం గ్రామంలోని పల్లవి హైస్కూల్‌లో శుక్రవారం ముందస్తు బతుకమ్మ వేడుకలను ఘనంగా నిర్వహించారు. రంగురంగుల పూలతో పేర్చిన బతుకమ్మలు, సంప్రదాయ వస్త్రధారణలో విద్యార్థినులు, ఉపాధ్యాయినులు చేసిన కోలాటాలు, ఆలపించిన బతుకమ్మ పాటలతో పాఠశాల ప్రాంగణం పండుగ శోభను సంతరించుకుంది.ఈ సందర్భంగా పాఠశాల చైర్మన్ రాచకొండ అశోక్ చారి మాట్లాడుతూ బతుకమ్మ పండుగ తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలకు ప్రతీకగా నిలుస్తుందని పేర్కొన్నారు. ప్రకృతిని, పూలను, స్త్రీశక్తిని గౌరవించే గొప్ప పండుగ బతుకమ్మ అని తెలిపారు. విద్యార్థులు చదువుతోపాటు మన సంస్కృతి, సంప్రదాయాల విశిష్టతను తెలుసుకొని భావితరాలకు అందించాలని సూచించారు.పాఠశాల కరస్పాండెంట్ గంజి మహేందర్ మాట్లాడుతూ పండుగల వెనుక ఉన్న చరిత్ర, సాంస్కృతిక ప్రాముఖ్యతను విద్యార్థులకు తెలియజేయడమే ఇలాంటి వేడుకల ముఖ్య ఉద్దేశమని అన్నారు. సాంస్కృతిక కార్యక్రమాల ద్వారా విద్యార్థుల్లో ఐకమత్యం, సోదరభావం, క్రమశిక్షణ, సంప్రదాయాల పట్ల గౌరవం పెంపొందుతాయని వివరించారు. విద్యతోపాటు నైతిక విలువలు, సామాజిక బాధ్యతలను అలవర్చుకోవాలని సూచించారు.పాఠశాల డైరెక్టర్ కోటగి రమేష్ మాట్లాడుతూ బతుకమ్మలో ఉపయోగించే ప్రతి పువ్వుకు ప్రత్యేక విశిష్టత, సాంస్కృతిక ప్రాధాన్యత ఉన్నాయని తెలిపారు. తంగేడు, గునుగు, బంతి, చామంతి, గుమ్మడి తదితర ప్రకృతి సిద్ధమైన పూలతో బతుకమ్మలను పేర్చడం తెలంగాణ సంప్రదాయ ప్రత్యేకత అని వివరించారు. బతుకమ్మ పండుగ ప్రకృతిని ప్రేమించడం, పర్యావరణాన్ని పరిరక్షించడం, పూల మొక్కలను సంరక్షించడం వంటి విలువలను నేర్పుతుందని పేర్కొన్నారు. ఈ పండుగ మహిళల ఐక్యతకు, కుటుంబ అనుబంధాలకు, సామాజిక సౌభ్రాతృత్వానికి ప్రతీకగా నిలుస్తుందని అన్నారు.పాఠశాల ప్రిన్సిపాల్ మేకల అశ్విని మాట్లాడుతూ పండుగలు ఆధ్యాత్మికతతోపాటు సామాజిక ఐక్యత, పరస్పర గౌరవం, కుటుంబ విలువలను నేర్పుతాయని తెలిపారు. విద్యార్థులు చిన్నతనం నుంచే తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలను గౌరవిస్తూ పండుగల ప్రాముఖ్యతను తెలుసుకోవాలని సూచించారు. వేడుకల్లో భాగంగా విద్యార్థినులు, ఉపాధ్యాయినులు బతుకమ్మల చుట్టూ వలయాకారంగా తిరుగుతూ సంప్రదాయ పాటలు పాడి, కోలాటాలు ఆడారు. రంగురంగుల పూలతో అలంకరించిన బతుకమ్మలు, విద్యార్థినుల సంప్రదాయ వస్త్రధారణ అందరినీ ఆకట్టుకున్నాయి.ఈ కార్యక్రమంలో పాఠశాల సమన్వయకర్తలు రాజు, నవ్యశ్రీ, వకుళదేవి, ఉపాధ్యాయులు, ఉపాధ్యాయినులు, భోజన సిబ్బంది, ఇతర సిబ్బంది, విద్యార్థినీ విద్యార్థులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలు, ప్రకృతి పరిరక్షణపై అవగాహన కల్పించేలా నిర్వహించిన ఈ ముందస్తు బతుకమ్మ సంబరాలు పాఠశాలలో ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి.



# ఓటు హక్కుల పరిరక్షణ కోసం పోరాటం ఆగదు

**ఎల్కతుర్తి, అక్టోబర్ 09 (నిత్యం నిఘా ప్రతినిధి) :** ఓటు హక్కుల పరిరక్షణ కోసం కాంగ్రెస్ పార్టీ చేస్తున్న పోరాటం నుంచి వెనక్కి తగ్గే ప్రసక్తే లేదని ఎల్కతుర్తి మండల కాంగ్రెస్ అధ్యక్షుడు ముప్పు శ్రీనివాస్ స్పష్టం చేశారు. ఎన్నికల కమిషనర్ జ్ఞానేశ్ కుమార్ వెంటనే తన పదవికి రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు.శుక్రవారం హనుమకొండ జిల్లా ఎల్కతుర్తి మండల కేంద్రంలో నిర్వహించిన కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం ఓటర్ల జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ ప్రక్రియను వెంటనే నిలిపివేయాలని కోరారు. ఈ ప్రక్రియలో ఓటరు జాబితా నుంచి తొలగించిన అర్హులైన ఓటర్ల పేర్లను తిరిగి చేర్చి, ప్రతి ఒక్కరికీ ఓటు హక్కు కల్పించాలని డిమాండ్ చేశారు.ప్రజాస్వామ్యంలో ఓటు హక్కు అత్యంత కీలకమని, అర్హులైన ప్రతి ఒక్కరూ తమ ఓటు హక్కును వినియోగించుకునేలా చూడాల్సిన బాధ్యత ఎన్నికల సంఘంపై ఉందని ముప్పు శ్రీనివాస్ పేర్కొన్నారు. ఓటర్ల హక్కులకు భంగం కలగకుండా చర్యలు తీసుకోవాలని కోరారు. ఓటు హక్కుల పరిరక్షణ కోసం కాంగ్రెస్ పార్టీ నిరంతరం పోరాటం కొనసాగిస్తుందని స్పష్టం చేశారు.ఈ సందర్భంగా కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు ఎన్నికల కమిషనర్ రాజీనామా చేయాలని నినాదాలు చేశారు. కార్యక్రమంలో ఎల్కతుర్తి మండల కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు, మహిళా కాంగ్రెస్ నాయకులు తదితరులు పాల్గొన్నారు.



# తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలకు ప్రతీక బతుకమ్మ




**ఎల్కతుర్తి, అక్టోబర్ 09 (నిత్యం నిఘా ప్రతినిధి) :** బతుకమ్మ పండుగ తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలకు, మహిళల ఆత్మగౌరవానికి, ప్రకృతి ఆరాధనకు ప్రతీకగా నిలుస్తుందని మండల ప్రెస్‌క్లబ్ వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షుడు సాతూరి చంద్రమౌళి అన్నారు. హనుమకొండ జిల్లా ఎల్కతుర్తి మండల ప్రజలకు ఎంగిలిపూల బతుకమ్మ పండుగ శుభాకాంక్షలు తెలిపారు. శుక్రవారం మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ ప్రజలందరూ బతుకమ్మ పండుగను ఆనందోత్సాహాలతో జరుపుకోవాలని ఆకాంక్షించారు. ప్రతి ఇంటా సుఖసంతోషాలు వెల్లివిరియాలని, ప్రజలందరూ ఆయురారోగ్యాలతో సంతోషంగా జీవించాలని కోరుకున్నారు.ఈ కార్యక్రమంలో ప్రెస్ క్లబ్ గౌరవ అధ్యక్షుడు కందుకూరి రాజన్న, ఉపాధ్యక్షులు చిర్ర ఉదయచందర్, శ్రీ రామోజ్ సతీష్ చారి, సిద్ధాంతి సదానిరంజన్, ప్రధాన కార్యదర్శి కొలిపాక శ్రీనివాస్, కార్యదర్శులు జూపాక శ్రీనివాస్, నల్లా రాజారెడ్డి, ప్రచార కార్యదర్శి బొంకూరి వంశీ, కార్యవర్గ సభ్యులు కర్రి తిరుపతి, బెజ్జంకి నరేష్, ఎర్రోళ్ల రాజబాబు, అద్దూరి అనిల్, అంబాల ప్రవీణ్, సభ్యులు ఎర్రోళ్ల సతీష్, చిలుముల ప్రమోద్, కంచెర్ల సదానందం, అద్దూరి శ్రీకాంత్, సుద్దాల జయప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

# వరంగల్ - ఖమ్మం ప్రధాన రహదారిపై గోతుల ముప్పు

**వరంగల్, అక్టోబర్ 09 (నిత్యం నిఘా ప్రతినిధి) :** వరంగల్–ఖమ్మం ప్రధాన రహదారిపై గోతులు తవ్వుతున్నారనే ఆరోపణలు, కాలుష్య సమస్యలపై ఫిర్యాదులు వినిపిస్తున్నప్పటికీ సంబంధిత అధికారులు సమర్థవంతమైన చర్యలు తీసుకోవడం లేదనే విమర్శలు వ్యక్తమవుతున్నాయి. వెంకటేశ్వర, అరుణ గ్రానైట్స్ కంపెనీల వ్యవహారంపై స్థానికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ప్రధాన రహదారిపై తవ్వకాల వల్ల ప్రయాణికుల భద్రతకు ముప్పు ఏర్పడుతోందా? కాలుష్యంతో ప్రజలు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారా? అనే అంశాలపై అధికారులు స్పష్టత ఇవ్వాలని కోరుతున్నారు.





### గోతులతో ప్రయాణికులకు ప్రమాదమా?

ప్రధాన రహదారిపై గోతులు తవ్వడం వల్ల వాహనదారులు, ప్రయాణికులకు ప్రమాదాలు పొంచి ఉన్నాయని స్థానికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. మరోవైపు గ్రానైట్ కంపెనీల కారణంగా కాలుష్య సమస్యలు తలెత్తుతున్నాయనే ఆరోపణలు కూడా వినిపిస్తున్నాయి. రహదారిపై ప్రయాణించే ప్రజల భద్రతను దృష్టిలో ఉంచుకుని సంబంధిత శాఖల అధికారులు క్షేత్రస్థాయిలో పరిశీలన చేపట్టాలని స్థానికులు కోరుతున్నారు.

### నోటీసులిచ్చి చేతులు దులుపుకున్నారా?

ఈ వ్యవహారంపై గతంలో సంబంధిత పంచాయతీ కార్యదర్శిని వివరణ కోరగా, కంపెనీకి నోటీసులు జారీ చేసినట్లు తెలిపినట్లు సమాచారం. అయితే నోటీసుల అనంతరం ఎలాంటి చర్యలు తీసుకున్నారు? తవ్వకాలు, కాలుష్య సమస్యలపై పరిశీలన జరిగిందా? నిబంధనల ఉల్లంఘనలు గుర్తించారా? అనే ప్రశ్నలకు సమాధానాలు రావాల్సి ఉంది. నోటీసులు జారీ చేయడంతోనే సమస్య పరిష్కారమైనట్లు కాదని, క్షేత్రస్థాయిలో పరిస్థితులను పరిశీలించి తగిన చర్యలు తీసుకోవాలని స్థానికులు డిమాండ్ చేస్తున్నారు.

### అధికారుల తీరుపై అనుమానాలు

కంపెనీల వ్యవహారంపై చర్యలు తీసుకోవడంలో జాప్యం జరుగుతోందని స్థానికులు అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. అధికారుల నిర్లక్ష్యానికి కారణాలేమిటన్న ప్రశ్నలు లేవనెత్తుతున్నారు. కంపెనీ యాజమాన్యాలకు అధికారుల అండ ఉందంటూ కొందరు అనుమానాలు వ్యక్తం చేస్తున్నప్పటికీ, ఈ ఆరోపణలకు సంబంధించి స్వతంత్ర నిర్ధారణ కావాల్సి ఉంది. సంబంధిత అధికారులు స్పందించి వాస్తవాలను వెల్లడించాలని ప్రజలు కోరుతున్నారు.

### ఉన్నతాధికారులు స్పందించాలి

ఈ సమస్యపై పత్రికల్లో కథనాలు వెలువడుతున్నప్పటికీ చర్యలు కనిపించడం లేదని స్థానికులు విమర్శిస్తున్నారు. వరంగల్–ఖమ్మం ప్రధాన రహదారిపై జరుగుతున్నట్లు ఆరోపణలు ఎదుర్కొంటున్న తవ్వకాలపై సమగ్ర విచారణ చేపట్టాలని, కాలుష్య ఆరోపణలను సంబంధిత శాఖలతో పరిశీలించాలని కోరుతున్నారు. రహదారి భద్రతకు ముప్పు ఉన్నట్లు తేలితే తక్షణమే నివారణ చర్యలు చేపట్టాలని, నిబంధనల ఉల్లంఘనలు నిర్ధారణ అయితే బాధ్యులపై చట్టప్రకారం చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తున్నారు. ప్రజల భద్రత, పర్యావరణ పరిరక్షణకు సంబంధించిన ఈ అంశంపై సంబంధిత అధికారులు స్పందించి, చేపట్టిన చర్యల వివరాలను ప్రజలకు తెలియజేయాల్సిన అవసరం ఉంది.

నిత్యం నిఘా
తెలుగు దినపత్రిక

# బీసీ ఉద్యమ నేత గుజ్జ సత్యంకు గవర్నర్ కోటాలో ఎమ్మెల్సీ పదవి ఇవ్వాలి



**ములుగు, అక్టోబర్ 9 (నిత్యం నిఘా ప్రతినిధి) :** బీసీల హక్కుల సాధన కోసం సుదీర్ఘకాలంగా పోరాటం చేస్తూ, విద్యా, వైద్య రంగాల్లో రెండు దశాబ్దాలుగా సామాజిక సేవలందిస్తున్న జాతీయ బీసీ సంక్షేమ సంఘం జాతీయ ఉపాధ్యక్షుడు, బీసీ జేఏసీ రాష్ట్ర సమన్వయకర్త గుజ్జ సత్యం (గుజ్జ సత్యనారాయణ)కు తెలంగాణ శాసనమండలిలో గవర్నర్ కోటా ఎమ్మెల్సీగా అవకాశం కల్పించాలని బీసీ జేఏసీ వర్కింగ్ ప్రెసిడెంట్ తోటకూరి శ్రీకాంత్ గౌడ్ డిమాండ్ చేశారు.బీసీ ఉద్యమ నేత ఆర్. కృష్ణయ్య అడుగు జాడల్లో నడుస్తూ గుజ్జ సత్యం బీసీలకు రాజకీయ ప్రాతినిధ్యం కల్పించడం, కులగణన, విద్యా, ఉద్యోగ అవకాశాలు, స్థానిక సంస్థల్లో రిజర్వేషన్లు, ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిల విడుదల, ఉపకార వేతనాలు, బీసీ కార్పొరేషన్ల బలోపేతం వంటి అంశాలపై నిరంతరం పోరాడుతున్నారని శ్రీకాంత్ గౌడ్ పేర్కొన్నారు. విద్యారంగంలో వేలాది మంది విద్యార్థులకు అవకాశాలు కల్పించేందుకు కృషి చేయడంతోపాటు, హోమియోపతి వైద్య సేవల ద్వారా సామాన్యులకు వైద్య సహాయం అందించడం అభినందనీయమని అన్నారు.పద్మశాలి, చేనేత వర్గాలు ఎదుర్కొంటున్న ఉపాధి, ఆర్థిక సమస్యల పరిష్కారానికి, సంప్రదాయ వృత్తుల పరిరక్షణకు గుజ్జ సత్యం చేస్తున్న కృషిని గుర్తించాలని కోరారు. బీసీల హక్కుల సాధన, పేద విద్యార్థుల భవిష్యత్తు, చేనేత కార్మికుల సంక్షేమం కోసం కృషి చేస్తున్న నాయకుడికి శాసనమండలిలో ప్రాతినిధ్యం కల్పిస్తే సామాజిక న్యాయానికి మరింత బలం చేకూరుతుందని అభిప్రాయపడ్డారు.గుజ్జ సత్యం అందించిన సామాజిక సేవలను, బీసీ ఉద్యమంలో ఆయన పాత్రను పరిగణనలోకి తీసుకుని గవర్నర్ కోటా ఎమ్మెల్సీ పదవికి ఆయన పేరును సిఫారసు చేయాలని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి తోటకూరి శ్రీకాంత్ గౌడ్ విజ్ఞప్తి చేశారు.

# కాటాపురం జెడ్పీహెచ్ఎస్‌లో ఘనంగా బతుకమ్మ సంబరాలు





**ములుగు జిల్లా / తాడ్వాయి, అక్టోబర్ 09 (నిత్యం నిఘా ప్రతినిధి) :** తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలకు ప్రతీకగా నిలిచే బతుకమ్మ పండుగను పురస్కరించుకొని తాడ్వాయి మండలం కాటాపురంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో గురువారం బతుకమ్మ వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఎంగిలిపూల బతుకమ్మతో పండుగ ప్రారంభం కానున్న నేపథ్యంలో పాఠశాలలో నిర్వహించిన ఈ వేడుకలు విద్యార్థుల్లో ఉత్సాహాన్ని నింపాయి.ఈ కార్యక్రమానికి కాటాపురం గ్రామ సర్పంచ్ దిడ్డి మోహన్ రావు ముఖ్య అతిథిగా హాజరయ్యారు. పాఠశాల ప్రధానోపాధ్యాయుడు బాణాల సుధాకర్‌తో పాటు ఉపాధ్యాయులు, విద్యార్థినీ విద్యార్థులు వేడుకల్లో పాల్గొన్నారు. విద్యార్థినులు సంప్రదాయబద్ధంగా రంగురంగుల పూలతో బతుకమ్మలను పేర్చి, తెలంగాణ సంస్కృతి వైభవాన్ని చాటుతూ ఉత్సాహంగా సంబరాలు జరుపుకున్నారు.బతుకమ్మ పండుగ మహిళల ఐక్యతకు, ప్రకృతి ఆరాధనకు, తెలంగాణ ఆత్మగౌరవానికి ప్రతీకగా నిలుస్తుందని ఈ వేడుకలు చాటిచెప్పాయి. పాఠశాల ఆవరణలో పండుగ వాతావరణం నెలకొనగా, విద్యార్థుల సందడితో వేడుకలు ఆనందంగా సాగాయి. తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలను భావితరాలకు పరిచయం చేయడంలో ఇటువంటి కార్యక్రమాలు కీలక పాత్ర పోషిస్తాయని ఉపాధ్యాయులు పేర్కొన్నారు.

# రామాలయం కమిటీ చైర్మన్‌గా ధన్నపునేని కిరణ్‌కుమార్



**ఏ టూరునాగార ం, అక్టోబర్ 09 (నిత్యం నిఘా ప్రతినిధి) :** ఏ టూరునాగార ం మండల కేంద్రంలోని శ్రీ సీతారామచంద్ర స్వామి ఆలయ నూతన కమిటీ చైర్మన్‌గా ధన్నపునేని రాజేశ్వరరావు (కిరణ్‌కుమార్) ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. శుక్రవారం స్థానిక రామాలయంలో గ్రామస్తులు, భక్తుల సమక్షంలో నూతన కమిటీ ఎన్నికలు నిర్వహించారు. ఆలయ మాజీ చైర్మన్ అలువాల శ్రీనివాస్ అధ్యక్షతన జరిగిన ఈ ఎన్నికల్లో నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. కమిటీ ఉపాధ్యక్షులుగా పెండ్యాల సంతోష్, బాల్య ప్రసాద్, ప్రధాన కార్యదర్శిగా తాడూరి దీనబాంధవస్వామి, కోశాధికారిగా కత్తెర శ్రీనివాస్ ఎన్నికయ్యారు. ప్రచార కార్యదర్శులుగా వెలకంటి శ్రీనివాస్, దాసరి కృష్ణ, సిసింద్రి, బాల్య రాజేష్, కార్యనిర్వాహక కార్యదర్శులుగా బాలోజు బ్రహ్మం, చిత్తుబొత్తుల సదానందం ఎంపికయ్యారు. గౌరవ సలహాదారులుగా పర్వతాల లాలయ్య, ఇర్సవడ్ల వెంకన్న, చిప్ప అశోక్, ఎగ్గడి వెంకటేశ్వర్లు, అలువాల శ్రీనివాస్, పెండ్యాల ప్రభాకర్‌లను ఎన్నుకున్నారు. ఈ కార్యక్రమంలో గ్రామస్తులు, భక్తులు, ప్రముఖులు పాల్గొన్నారు.

# వర్ధన్నపేట మున్సిపాలిటీలో మళ్లీ ముదిరిన వివాదం



**వరంగల్/వర్ధన్నపేట, అక్టోబర్ 9 (నిత్యం నిఘా ప్రతినిధి) :** వర్ధన్నపేట మున్సిపాలిటీలో మరోసారి వివాదం రాజుకుంది. దసరా ఉత్సవాల నిర్వహణ, వినాయక చవితి వేడుకల ఖర్చులపై నెలకొన్న వివాదం మున్సిపల్ కౌన్సిల్ సమావేశంలో ఉద్రిక్తతకు దారితీసింది. మున్సిపల్ చైర్మన్ పాలకుర్తి సారంగపాణి ఏకపక్షంగా వ్యవహరిస్తున్నారని, నిధుల వినియోగంపై ప్రశ్నించిన తమను దుర్భాషలాడుతూ అవమానించారని బీఆర్ఎస్ కౌన్సిలర్లు ఆరోపించారు. ఈ నేపథ్యంలో సమావేశాన్ని బహిష్కరించి, మున్సిపల్ కార్యాలయం ఎదుట నిరసన తెలిపారు.

### సమావేశం ఉద్దేశంపై అభ్యంతరం

దసరా ఉత్సవాల నిర్వహణతోపాటు ఇతర మున్సిపల్ అంశాలపై చర్చించేందుకు సమావేశం ఏర్పాటు చేసినట్లు తమకు సమాచారం ఇచ్చారని బీఆర్ఎస్ కౌన్సిలర్లు తెలిపారు. అయితే, జనరల్ బాడీ సమావేశ ఎజెండాపై ముందస్తు సమాచారం ఇవ్వకుండా, ఉత్సవాల సమావేశం పేరుతో సాధారణ సమావేశానికి సంతకాలు తీసుకునే ప్రయత్నం చేశారని ఆరోపించారు. సమావేశం ఉద్దేశం, చర్చించాల్సిన అంశాలపై స్పష్టత ఇవ్వకపోవడంపై అభ్యంతరం వ్యక్తం చేశారు.

### వినాయక చవితి ఖర్చుల వివరాలేవి?

గతంలో వినాయక చవితి ఉత్సవాల నిర్వహణకు సంబంధించి కౌన్సిల్‌లో చర్చించకుండానే చైర్మన్ సొంత నిర్ణయాలతో కార్యక్రమాలు నిర్వహించారని బీఆర్ఎస్ కౌన్సిలర్లు విమర్శించారు. ఉత్సవాలకు ఎంత ఖర్చు చేశారు? నిధులను ఏ విధంగా వినియోగించారు? అనే ప్రశ్నలకు సమాధానం కోరినందుకే తమపై ఆగ్రహం వ్యక్తం చేసి దుర్భాషలాడారని ఆరోపించారు. ప్రజాధనం ఖర్చుపై ప్రశ్నించడం ప్రజాప్రతినిధులుగా తమ బాధ్యతని, ఖర్చుల వివరాలు వెల్లడించాల్సిన బాధ్యత పాలకవర్గంపై ఉందని పేర్కొన్నారు.

### ప్రశ్నిస్తే అవమానిస్తారా?

ప్రజల తరఫున ప్రశ్నించే కౌన్సిలర్ల అభ్యంతరాలను పట్టించుకోకుండా వ్యవహరించడం సరికాదని బీఆర్ఎస్ కౌన్సిలర్లు ఆగ్రహం వ్యక్తం చేశారు. చైర్మన్ వ్యవహారశైలిని నిరసిస్తూ సమావేశం నుంచి బయటకు వచ్చి మున్సిపల్ కార్యాలయం ఎదుట నిరసన చేపట్టారు. ఉత్సవాల నిర్వహణలో పారదర్శకత పాటించాలని, నిధుల వినియోగానికి సంబంధించిన పూర్తి వివరాలను వెల్లడించాలని డిమాండ్ చేశారు.

### ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేస్తాం

మున్సిపల్ చైర్మన్ పాలకుర్తి సారంగపాణి వ్యవహారశైలి, ఉత్సవాల నిర్వహణకు సంబంధించిన ఖర్చులు, నిధుల వినియోగంపై ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేస్తామని బీఆర్ఎస్ కౌన్సిలర్లు స్పష్టం చేశారు. ప్రజాధనం ఖర్చు విషయంలో పారదర్శకత పాటించాలని, కౌన్సిల్ సమావేశాల్లో ప్రజాప్రతినిధులకు తమ అభిప్రాయాలు వెల్లడించే అవకాశం కల్పించాలని కోరారు. ప్రజా సమస్యలపై చర్చించి పరిష్కార మార్గాలు అన్వేషించాల్సిన కౌన్సిల్ సమావేశాలు వివాదాలకు వేదికగా మారడంపై స్థానికంగా చర్చ జరుగుతోంది. ఉత్సవాల ఖర్చులపై కౌన్సిలర్లు లేవనెత్తిన ప్రశ్నలకు మున్సిపల్ పాలకవర్గం ఎలాంటి వివరణ ఇస్తుంది? ఈ వివాదంపై ఉన్నతాధికారులు స్పందిస్తారా? అన్నది వేచి చూడాలి.

# తెలంగాణ ఆత్మగౌరవానికి ప్రతీక బతుకమ్మ



**హనుమకొండ / ఐనవోలు, అక్టోబర్ 9 (నిత్యం నిఘా ప్రతినిధి) :** తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలకు, ఆత్మగౌరవానికి ప్రతీకగా నిలిచే బతుకమ్మ పండుగను ప్రతి ఒక్కరూ ఆనందోత్సాహాలతో జరుపుకోవాలని ఐనవోలు మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు నకర కంటి మోహన్ గౌడ్ పిలుపునిచ్చారు. ఎంగిలిపూల బతుకమ్మ ప్రారంభం సందర్భంగా మండల ప్రజలకు, కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలకు, ముఖ్యంగా ఆడపడుచులకు ఆయన హృదయపూర్వక శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా మోహన్ గౌడ్ మాట్లాడుతూ బతుకమ్మ కేవలం పూల పండుగ మాత్రమే కాదని, తెలంగాణ అస్తిత్వానికి, ఆడపడుచుల ఆత్మీయతకు, ప్రకృతిపై ప్రజలకున్న ఆరాధనకు ప్రతీక అని పేర్కొన్నారు. వివిధ రకాల రంగురంగుల పూలతో బతుకమ్మలను పేర్చి, సంప్రదాయబద్ధంగా పూజిస్తూ మహిళలు జరుపుకునే ఈ వేడుక తెలంగాణ సంస్కృతిలో ప్రత్యేక స్థానాన్ని కలిగి ఉందన్నారు.బతుకమ్మ పండుగ ప్రజల మధ్య ఐక్యతను, సోదర భావాన్ని పెంపొందిస్తుందని, తరతరాలుగా వస్తున్న తెలంగాణ సంప్రదాయాల గొప్పతనాన్ని చాటిచెబుతుందని తెలిపారు. ఆధునిక కాలంలోనూ పండుగల విశిష్టతను మరచిపోకుండా, మన సంస్కృతి, సంప్రదాయాలను భావితరాలకు అందించాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందని అన్నారు.బతుకమ్మ పండుగ ఐనవోలు మండల ప్రజల జీవితాల్లో సుఖసంతోషాలను నింపాలని, ప్రతి కుటుంబం ఆయురారోగ్యాలతో, సిరిసంపదలతో వర్ధిల్లాలని మోహన్ గౌడ్ ఆకాంక్షించారు. మండల ప్రజలందరూ ఐకమత్యంతో, భక్తిశ్రద్ధలతో బతుకమ్మ సంబరాలను ఘనంగా జరుపుకోవాలని కోరారు.

# శాంతినికేతన్ విద్యాలయంలో ముందస్తు బతుకమ్మ సంబరాలు



**పెద్దపల్లి జిల్లా / మంథని, అక్టోబర్ 9 (నిత్యం నిఘా ప్రతినిధి) :** తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలకు ప్రతీకగా నిలిచే బతుకమ్మ పండుగను పురస్కరించుకుని పెద్దపల్లి జిల్లా మంథని మండలం స్వర్ణపల్లిలోని శాంతినికేతన్ విద్యాలయంలో ముందస్తు బతుకమ్మ వేడుకలను ఘనంగా నిర్వహించారు. పాఠశాల ఆవరణలో పండుగ సందడి నెలకొనగా, విద్యార్థినులు, వారి తల్లులు, మహిళా ఉపాధ్యాయులు ఉత్సాహంగా పాల్గొని సంబరాలు జరుపుకున్నారు.తెలంగాణ ఆడపడుచుల ఆత్మీయతకు, ప్రకృతితో మమేకమైన జీవన విధానానికి ప్రతీకగా నిలిచే బతుకమ్మ పండుగ విశిష్టతను విద్యార్థినులకు తెలియజేయాలనే ఉద్దేశంతో ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు. వివిధ రకాల పూలతో బతుకమ్మలను అందంగా పేర్చి, సంప్రదాయ పద్ధతుల్లో వేడుకలు జరుపుకున్నారు. సంప్రదాయ దుస్తుల్లో విద్యార్థినులు చేసిన సందడి ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది.

### సంస్కృతి, సంప్రదాయాలపై అవగాహన

విద్యార్థులకు పాఠ్యాంశాల బోధనతోపాటు తెలంగాణ ప్రాంతీయ పండుగలు, ఆచార వ్యవహారాల గురించి తెలియజేయడం కూడా విద్యలో ముఖ్యమైన భాగమని ఈ వేడుకలు చాటిచెప్పాయి. ఇలాంటి కార్యక్రమాల ద్వారా చిన్నారుల్లో సంప్రదాయాల పట్ల గౌరవం, ప్రకృతి పట్ల ప్రేమ, సమష్టిగా వేడుకలు జరుపుకునే మనస్తత్వం పెంపొందుతాయి. బతుకమ్మ వంటి పూల పండుగల ద్వారా పూల ప్రాధాన్యత, ప్రకృతి అందాలు, మహిళల భాగస్వామ్యం గురించి విద్యార్థినులు తెలుసుకునే అవకాశం కలుగుతుంది.పాఠశాల స్థాయిలో పండుగలను నిర్వహించడం వల్ల విద్యార్థులు తమ ప్రాంతీయ సంస్కృతిని ప్రత్యక్షంగా తెలుసుకోవడంతోపాటు, కుటుంబ సభ్యులు, ఉపాధ్యాయులతో కలిసి ఆనందంగా గడిపే అవకాశం లభిస్తుంది. ఈ నేపథ్యంలో శాంతినికేతన్ విద్యాలయంలో నిర్వహించిన ముందస్తు బతుకమ్మ సంబరాలు విద్యార్థినుల్లో ఉత్సాహాన్ని నింపాయి.ఈ కార్యక్రమంలో పాఠశాల కరస్పాండెంట్ కోరవేన కుమార్, ప్రధానోపాధ్యాయుడు కోరవేన అవినాష్, ఉపాధ్యాయులు జంగ స్వామి, మానస, చంద్రముఖి, కిరణ్మయి, విద్యార్థినులు, వారి తల్లులు పాల్గొన్నారు. మహిళా ఉపాధ్యాయులు, తల్లుల భాగస్వామ్యంతో వేడుకలు ఉత్సాహంగా సాగాయి.

Printed, Published and Owned by Bura Nagesh Goud, on behalf of Amulya Publications & Printers Graphics, Editor - Bura Nagesh Goud, is responsible for news selection under PRB act prgi.gov.in RNI. TGTEL/25/A1665, # 5-11-1014/A, Naim Nagar, Hanamkonda, Warangal, Telangana, India - 506009, Cell : 9441974025, 9440170543 Email:nityamnigha.acs@gmail.com

నిత్యం నిఘా
తెలుగు దినపత్రిక

# పందికుంట పల్లె దవాఖానకు తాళం.. రోగులకు తప్పని తిప్పలు

**పర్వతగిరి, అక్టోబర్ 09 ( నిత్యం నిఘా ప్రతినిధి) :** గ్రామీణ ప్రాంత ప్రజలకు స్థానికంగానే వైద్య సేవలు అందించాలనే లక్ష్యంతో ప్రభుత్వం ఏర్పాటు చేసిన పల్లె దవాఖానల నిర్వహణపై పందికుంటలో ప్రశ్నలు తలెత్తుతున్నాయి. గ్రామంలోని పల్లె దవాఖానలో సిబ్బంది సమయపాలన పాటించడం లేదని, మధ్యాహ్నం తర్వాత ఆసుపత్రికి తాళం వేసి కనిపిస్తోందని, వారంలో రెండు, మూడు రోజులు దవాఖాన తెరవడం లేదని స్థానికులు ఆరోపిస్తున్నారు. ఈ పరిస్థితులపై సంబంధిత వైద్యశాఖ అధికారులు దృష్టి సారించి వాస్తవాలను పరిశీలించాలని గ్రామస్థులు కోరుతున్నారు.




### పని వేళలపై స్పష్టత ఏదీ?

వైద్యం కోసం దవాఖానకు వెళ్లినప్పుడు సిబ్బంది అందుబాటులో ఉండటం లేదని కొందరు గ్రామస్థులు వాపోతున్నారు. మధ్యాహ్నం తర్వాత ఆసుపత్రి మూసివేసి ఉంటోందన్న ఆరోపణలతో పాటు, వారంలో కొన్ని రోజులు దవాఖాన తెరుచుకోవడం లేదనే ఫిర్యాదులు వినిపిస్తున్నాయి. అయితే ఆసుపత్రి పని వేళలు ఏమిటి? సిబ్బంది విధులకు క్రమం తప్పకుండా హాజరవుతున్నారా? అనే అంశాలపై అధికారులు క్షేత్రస్థాయిలో విచారణ జరిపితే వాస్తవ పరిస్థితులు వెలుగులోకి వచ్చే అవకాశం ఉంది.

### ఆరోగ్య కార్యకర్తల సేవలపై ఆరా తీయాలి

గ్రామీణ ప్రాంతాల్లో ఆశా కార్యకర్తలు, ఏఎన్ఎంలు ప్రజారోగ్య పరిరక్షణలో కీలక పాత్ర పోషిస్తారు. గర్భిణుల ఆరోగ్య పర్యవేక్షణ, బాలింతలకు సూచనలు, చిన్నపిల్లలకు టీకాలు, కుటుంబ ఆరోగ్య సేవలు, వ్యాధులపై అవగాహన కల్పించడం వంటి బాధ్యతలు నిర్వహిస్తారు. అయితే పందికుంటలో ఆరోగ్య సిబ్బంది మధ్యాహ్నం తర్వాత అందుబాటులో ఉండటం లేదని ఆరోపణలు రావడంతో వారి విధుల నిర్వహణపై అధికారులు పరిశీలన జరపాల్సిన అవసరం ఉంది. సిబ్బంది హాజరు రికార్డులు, విధుల పట్టిక, నిర్వహించిన ఆరోగ్య కార్యక్రమాల వివరాలను తనిఖీ చేసి, ఆరోపణల్లో వాస్తవమెంతన్నది నిర్ధారించాలని స్థానికులు కోరుతున్నారు. ఆరోగ్య సేవలకు అంతరాయం కలుగుతోందా లేదా అన్నది సంబంధిత రికార్డులు, క్షేత్రస్థాయి పరిశీలన ద్వారా స్పష్టం చేయాల్సి ఉంది.

### చిన్నపాటి వైద్యానికీ ఇతర ప్రాంతాలకు వెళ్లాల్సిందేనా?

గ్రామంలోనే వైద్య సేవలు అందుబాటులో ఉంటాయనే ఆశతో ప్రజలు పల్లె దవాఖానను ఆశ్రయిస్తారు. జ్వరం, జలుబు, దగ్గు వంటి సాధారణ ఆరోగ్య సమస్యలకు వైద్య సలహా అవసరమైనప్పుడు సిబ్బంది అందుబాటులో లేకపోతే ఇతర ప్రాంతాల్లోని ఆసుపత్రులకు వెళ్లాల్సిన పరిస్థితి ఏర్పడుతుంది. ముఖ్యంగా వృద్ధులు, గర్భిణులు, చిన్నపిల్లలు, ఆర్థికంగా వెనుకబడిన కుటుంబాలకు ఇది ఇబ్బందికరంగా మారే అవకాశం ఉంది. అలాగే టీకాల కార్యక్రమాలు, గర్భిణుల ఆరోగ్య పర్యవేక్షణ, ఇతర ప్రజారోగ్య సేవలు నిర్ణీత షెడ్యూల్ ప్రకారం కొనసాగుతున్నాయా అనే అంశాన్ని కూడా అధికారులు పరిశీలించాల్సి ఉంది.

### పర్యవేక్షణ ఏది?

ప్రభుత్వ వైద్య సేవలు ప్రజలకు సక్రమంగా అందేలా చూడాల్సిన బాధ్యత సంబంధిత వైద్యాధికారులపై ఉంది. సిబ్బంది హాజరు, ఆసుపత్రి పని వేళలు, రోగులకు అందుతున్న సేవలను ఎప్పటికప్పుడు పర్యవేక్షించాలి. పందికుంట పల్లె దవాఖానపై వస్తున్న ఆరోపణల నేపథ్యంలో ఉన్నతాధికారులు క్షేత్రస్థాయిలో తనిఖీలు నిర్వహించి వాస్తవాలను నిర్ధారించాలని గ్రామస్థులు కోరుతున్నారు. ఆరోపణలు నిజమని తేలితే నిబంధనల ప్రకారం చర్యలు తీసుకోవడంతోపాటు, భవిష్యత్తులో ఇలాంటి పరిస్థితులు పునరావృతం కాకుండా చూడాలని విజ్ఞప్తి చేస్తున్నారు. ఇప్పటికైనా వైద్యశాఖ అధికారులు స్పందించి పందికుంట పల్లె దవాఖాన పనితీరుపై సమగ్ర పరిశీలన జరిపి, ప్రజలకు నిర్ణీత పని వేళల్లో నిరంతర వైద్య సేవలు అందేలా చర్యలు తీసుకుంటారా? అన్నది వేచి చూడాలి.

# బతుకమ్మ పాటలతో మారుమోగిన ప్రభుత్వ జూనియర్ కళాశాల

**వరంగల్ / వర్ధన్నపేట, అక్టోబర్ 09 (నిత్యం నిఘా ప్రతినిధి) :** తెలంగాణ ఆడపడుచుల ఆత్మగౌరవానికి, సంస్కృతి సంప్రదాయాలకు ప్రతీకగా నిలిచే బతుకమ్మ వేడుకలు వర్ధన్నపేట ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఘనంగా నిర్వహించారు. బతుకమ్మ పాటలు, కోలాటాలు, విద్యార్థినుల ఉత్సాహంతో కళాశాల ప్రాంగణం పండుగ శోభను సంతరించుకుంది. అధ్యాపకులు, విద్యార్థులు కలిసి సంప్రదాయ వేడుకల్లో పాల్గొని సంబరాలు చేసుకున్నారు. బతుకమ్మ పాటలకు అనుగుణంగా అధ్యాపకులు, విద్యార్థినులు ప్రదర్శించిన కోలాటాలు ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. సంప్రదాయ గీతాలతో కళాశాల ప్రాంగణం మారుమోగగా, విద్యార్థినుల ఉత్సాహభరిత నృత్యాలు వేడుకలకు మరింత కళను తీసుకొచ్చాయి. తెలంగాణ సంస్కృతి వైభవాన్ని చాటిచెబుతూ, పండుగల ప్రాముఖ్యతను భావితరాలకు పరిచయం చేసేలా సంబరాలు సాగాయి. విద్యతో పాటు విద్యార్థుల్లో సాంస్కృతిక చైతన్యం, ఐక్యతా భావాన్ని పెంపొందించేందుకు ఇలాంటి కార్యక్రమాలు దోహదపడతాయని ఈ వేడుకలు చాటిచెప్పాయి. తెలంగాణ సంప్రదాయాలను కాపాడుతూ, పండుగల విశిష్టతను నేటి తరానికి అందించడంలో కళాశాల వేదికగా నిర్వహించిన బతుకమ్మ సంబరాలు ప్రత్యేకతను సంతరించుకున్నాయి.ఈ కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్, అధ్యాపకులు, విద్యార్థులు, ఇతర సిబ్బంది పాల్గొన్నారు.






# రైతుల సంక్షేమమే ప్రభుత్వ లక్ష్యం

**వరంగల్ జిల్లా, సంగెం, అక్టోబర్ 09 (నిత్యం నిఘా ప్రతినిధి):** రైతుల సంక్షేమమే లక్ష్యంగా కాంగ్రెస్ ప్రజా ప్రభుత్వం పనిచేస్తోందని పరకాల ఎమ్మెల్యే రేవూరి ప్రకాశ్‌రెడ్డి అన్నారు. సంగెం మండల కేంద్రంలోని ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం (పీఏసీఎస్) నూతన చైర్‌పర్సన్‌గా నియమితులైన జనగాం విజయ రమేష్‌తో పాటు కార్యవర్గ సభ్యుల ప్రమాణ స్వీకార కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా సంగెం బస్టాండ్ నుంచి నిర్వహించిన ర్యాలీలో ఎమ్మెల్యే పాల్గొన్నారు. అనంతరం నూతనంగా బాధ్యతలు స్వీకరించిన చైర్‌పర్సన్, కార్యవర్గ సభ్యులకు శుభాకాంక్షలు తెలిపారు.

### రైతులకు అందుబాటులో ఉండాలి

సహకార సంఘాలు రైతులకు అండగా నిలుస్తూ వ్యవసాయ రంగ అభివృద్ధిలో కీలక పాత్ర పోషిస్తున్నాయని ఎమ్మెల్యే పేర్కొన్నారు. నూతన కార్యవర్గ సభ్యులు రైతులకు ఎల్లప్పుడూ అందుబాటులో ఉంటూ, వారి సమస్యల పరిష్కారానికి కృషి చేయాలని సూచించారు. పీఏసీఎస్ ద్వారా ఎరువులు, విత్తనాలు, ఇతర వ్యవసాయ సేవలను సకాలంలో అందించి, సంఘం అభివృద్ధికి సమష్టిగా పనిచేయాలని కోరారు. రైతు కుటుంబాల్లో సంతోషం నింపే లక్ష్యంతో సహకార సంఘాలను బలోపేతం చేస్తున్నామని తెలిపారు. ప్రతి వ్యవసాయ క్లస్టర్ పరిధిలో రైతు ఉత్పత్తిదారుల సంఘాలను ఏర్పాటు చేయనున్నట్లు వెల్లడించారు.



### ఆధునిక వ్యవసాయ పద్ధతులను అందిపుచ్చుకోవాలి

కాలానుగుణంగా వ్యవసాయ రంగంలో వస్తున్న మార్పులను రైతులు గమనిస్తూ, ఆధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని వినియోగించుకోవాలని రేవూరి ప్రకాశ్‌రెడ్డి సూచించారు. నూతన వ్యవసాయ పద్ధతులను అనుసరించి సాగు ఖర్చులను తగ్గించుకుంటూ మెరుగైన ఫలితాలు సాధించే దిశగా ముందుకు సాగాలని పేర్కొన్నారు. రైతులకు అవసరమైన సేవలు సకాలంలో అందించడంలో సహకార సంఘాల బాధ్యత ఎంతో కీలకమని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో ప్రజాప్రతినిధులు, అధికారులు, మండల నాయకులు, వివిధ గ్రామాల సర్పంచులు, ఉపసర్పంచులు, వార్డు సభ్యులు, యువజన నాయకులు, స్థానిక ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# ఫేక్ ఇన్‌స్టాగ్రామ్ ఖాతాతో మహిళకు వేధింపులు




**వరంగల్ / వర్ధన్నపేట, అక్టోబర్ 09 (నిత్యం నిఘా ప్రతినిధి) :** ప్రేమ పేరుతో మహిళను వేధిస్తూ, ఆమె అనుమతి లేకుండా ఫొటోతో నకిలీ ఇన్‌స్టాగ్రామ్ ఖాతా సృష్టించి అసభ్యకరమైన చిత్రాలు, సందేశాలను ఇతరులకు పంపిన నిందితుడిని ఎల్కతుర్తి పోలీసులు అరెస్ట్ చేశారు. అనంతరం అతడిని న్యాయస్థానంలో హాజరుపరిచి, న్యాయస్థానం ఆదేశాల మేరకు న్యాయ నిర్బంధానికి తరలించారు.పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. ఎల్కతుర్తి మండలానికి చెందిన ఓ మహిళతో పరిచయం పెంచుకున్న నిందితుడు ప్రేమ పేరుతో ఆమెను వేధించాడు. ఇందుకు ఆమె అంగీకరించకపోవడంతో ఆమెపై కక్ష పెంచుకున్నాడు. ఆమెను వేధించాలనే ఉద్దేశంతో, ఆమె అనుమతి లేకుండా ఆమె ఫొటోను ఖాతా చిత్రంగా ఉపయోగించి ఇన్‌స్టాగ్రామ్‌లో నకిలీ ఖాతా సృష్టించాడు. ఆ ఖాతా ద్వారా ఆమె పేరుతో ఇతరులకు అసభ్యకరమైన చిత్రాలు, సందేశాలు పంపిస్తూ వేధింపులకు పాల్పడ్డాడు.ఈ ఘటనపై ఫిర్యాదు అందుకున్న ఎల్కతుర్తి పోలీసులు విచారణ చేపట్టి నిందితుడిని గుర్తించి అరెస్ట్ చేశారు. అనంతరం చట్టపరమైన ప్రక్రియను పూర్తి చేసి న్యాయస్థానంలో హాజరుపరిచారు.

### మహిళలు ధైర్యంగా పోలీసులను సంప్రదించాలి

సామాజిక మాధ్యమాల ద్వారా వేధింపులకు గురైతే మహిళలు భయపడకుండా ధైర్యంగా పోలీసులను సంప్రదించాలని ఎల్కతుర్తి సీఐ కె. శ్రీను సూచించారు. బాధితులు తమకు ఎదురైన సమస్యలను పోలీసుల దృష్టికి తీసుకువస్తే తగిన చర్యలు తీసుకుంటామని తెలిపారు. మహిళలకు రక్షణ కల్పించడంతో పాటు, వేధింపులకు పాల్పడే వారిపై చట్ట ప్రకారం చర్యలు తీసుకుంటామని సీఐ స్పష్టం చేశారు.

# వ్యవసాయ విద్యుత్ సరఫరాలో అంతరాయాలపై బీజేపీ ఆగ్రహం

**ఎల్కతుర్తి, అక్టోబర్ 09 (నిత్యం నిఘా ప్రతినిధి) :** కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత వ్యవసాయ విద్యుత్ సరఫరాలో సమస్యలు పెరిగాయని బీజేపీ వరంగల్ జిల్లా అధ్యక్షుడు గంట రవికుమార్ విమర్శించారు. రైతులకు నిరంతర విద్యుత్ సరఫరా చేస్తామని హామీ ఇచ్చిన ప్రభుత్వం, క్షేత్రస్థాయిలో రైతులు ఎదుర్కొంటున్న ఇబ్బందులను పరిష్కరించడంలో నిర్లక్ష్యం వహిస్తోందని ఆరోపించారు.రైతుల సంక్షేమమే లక్ష్యమని చెబుతున్న పాలకులు, వ్యవసాయానికి విద్యుత్ సరఫరాలో ఎదురవుతున్న అంతరాయాలను ఎందుకు పరిష్కరించడం లేదని ఆయన ప్రశ్నించారు. విద్యుత్ సరఫరా సక్రమంగా లేకపోతే పంటల సాగుపై ప్రభావం పడే ప్రమాదం ఉందని పేర్కొన్నారు. రైతుల ఇబ్బందులను అధికారులు, ప్రజాప్రతినిధులు వెంటనే గుర్తించి తగిన చర్యలు తీసుకోవాలని కోరారు.

### హామీలు అమలు చేయాలి

రైతు సంక్షేమంపై మాటలకు, క్షేత్రస్థాయిలో పరిస్థితులకు పొంతన ఉండాలని గంట రవికుమార్ అన్నారు. వ్యవసాయానికి అవసరమైన విద్యుత్‌ను నిర్ణీత షెడ్యూల్ ప్రకారం సక్రమంగా సరఫరా చేయాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. రైతులకు ఇచ్చిన హామీలను అమలు చేసి, విద్యుత్ సమస్యలకు శాశ్వత పరిష్కారం చూపాలని కోరారు.రైతుల సమస్యలపై ప్రభుత్వం తక్షణమే స్పందించి విద్యుత్ సరఫరాను మెరుగుపరచాలని, లేనిపక్షంలో రైతుల పక్షాన బీజేపీ ఆధ్వర్యంలో పోరాటాన్ని ఉధృతం చేస్తామని గంట రవికుమార్ హెచ్చరించారు.



నిత్యం నిఘా
తెలుగు దినపత్రిక

# సెయింట్ థామస్ పాఠశాలలో ఘనంగా బతుకమ్మ సంబరాలు



**ఎల్కతుర్తి, అక్టోబర్ 09 (నిత్యం నిఘా ప్రతినిధి) :** హనుమకొండ జిల్లా ఎల్కతుర్తి మండలంలోని సెయింట్ థామస్ ఆల్టిట్యూడ్ ఉన్నత పాఠశాలలో బతుకమ్మ వేడుకలను ఘనంగా నిర్వహించారు. విద్యార్థినులు రంగురంగుల పూలతో బతుకమ్మలను పేర్చి, సంప్రదాయ దుస్తులు ధరించి బతుకమ్మ పాటలు పాడుతూ ఆటపాటలతో సందడి చేశారు. పాఠశాల ప్రాంగణం పండుగ శోభను సంతరించుకుంది.ఈ సందర్భంగా పాఠశాల కరస్పాండెంట్ పుష్కారి కార్తీక్ రావు మాట్లాడుతూ, బతుకమ్మ పండుగ తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలకు ప్రతీకగా నిలుస్తుందని అన్నారు. విద్యార్థులకు చదువుతో పాటు మన సంస్కృతి, సంప్రదాయాలపై అవగాహన కల్పించడం ఎంతో ముఖ్యమని పేర్కొన్నారు. భావితరాలకు తెలంగాణ పండుగల విశిష్టతను తెలియజేస్తూ సంప్రదాయాలను కాపాడుకోవాలని సూచించారు.ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయుడు మర్రి అశోక్, ఉప ప్రధానోపాధ్యాయుడు లింగం మొగిలి, వ్యాయామ ఉపాధ్యాయుడు కర్రె తిరుపతి, ఉపాధ్యాయినులు, ఇతర ఉపాధ్యాయ బృందం పాల్గొన్నారు.

# వరంగల్ జిల్లా కాంగ్రెస్ ఎస్సీ సెల్ కార్యదర్శిగా దామెర బాబు



**వరంగల్/సంగెం, అక్టోబర్ 09 (నిత్యం నిఘా ప్రతినిధి) :** వరంగల్ జిల్లా కాంగ్రెస్ ఎస్సీ సెల్ కార్యదర్శిగా దామెర బాబు నియమితులయ్యారు. ఈ మేరకు జిల్లా కాంగ్రెస్ ఎస్సీ సెల్ చైర్మన్ చిలువేరు శ్రీనివాస్ నియామక ఉత్తర్వులు జారీ చేశారు.ఈ సందర్భంగా దామెర బాబు మాట్లాడుతూ, తనకు కార్యదర్శి పదవి బాధ్యతలు అప్పగించిన జిల్లా కాంగ్రెస్ ఎస్సీ సెల్ చైర్మన్ చిలువేరు శ్రీనివాస్‌కు, తన నియామకానికి సహకరించిన పరకాల శాసనసభ్యుడు రేవూరి ప్రకాశ్ రెడ్డికి, కాంగ్రెస్ సంగెం మండల అధ్యక్షుడు ఇండ్ల రవికి హృదయపూర్వక ధన్యవాదాలు తెలిపారు.కాంగ్రెస్ పార్టీ బలోపేతానికి కృషి చేయడంతో పాటు, ఎస్సీ వర్గాల సంక్షేమం కోసం తన వంతు కృషి చేస్తానని దామెర బాబు పేర్కొన్నారు. ఆయన నియామకం పట్ల కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు హర్షం వ్యక్తం చేస్తూ అభినందనలు తెలిపారు.

# లిటిల్ చాంపియన్స్ స్కూల్ లో ఘనంగా బతుకమ్మ సంబరాలు




**ఇల్లందు, అక్టోబర్ 07, (నిత్యం నిఘా ప్రతినిధి) :** భద్రాద్రికొత్తగూడెం /టేకుల పల్లి మండలం కొప్పురాయి పంచాయతీ పరిధిలో జి పి ఎస్. ఒడ్డుగూడెం పాఠశాలను హైదరాబాదు నుండి వచ్చిన ఇక్రిశాట్ సంస్థ వారు.ఐటీడీఏ జి సి డి ఓ. బృందం జిపిఎస్ ఒడ్డుగూడెం పాఠశాలను సందర్శించి స్కూల్లో కావలసిన మౌలిక సదుపాయాలు ఎం డి ఎం పిల్లలకు కావలసిన పౌష్టికాహారం. కావలసిన వస్తువులు వాటి అవసరాలు ఉపయోగాల గురించి పూర్తిగా వివరించారు.పిల్లల తల్లిదండ్రుల నుంచి ఉపాధ్యాయుల నుంచి పిల్లల నుంచి పూర్తి సమాచారం కోసం సుమారు రెండు గంటల పాటు అన్ని విషయాలపై చర్చించడం సమగ్ర సమాచారం తీసుకోవడం జరిగినది దీని కార్యక్రమానికి గ్రామ సర్పంచ్ చింత కళ్యాణ్ పంచాయతి సెక్రటరీ సంజీవరావు గ్రామ పెద్దలు పాల్గొన్నారు.

# పోచమ్మకుంటలో ఘనంగా దుర్గామాత ఆగమన వేడుకలు

- **ముఖ్య అతిథిగా హాజరై ప్రారంభించిన బీజేపీ నాయకురాలు రావు పద్మ**



**హనుమకొండ/ పోచమ్మకుంట , అక్టోబర్ 09 (నిత్యం నిఘా ప్రతినిధి):** వరంగల్ నగరంలోని 54వ డివిజన్ పోచమ్మకుంటలో దుర్గామాత ఆగమన కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన బీజేపీ నాయకురాలు రావు పద్మ కొబ్బరికాయ కొట్టి వేడుకలను ప్రారంభించారు. అనంతరం కాలనీవాసులను ఉద్దేశించి మాట్లాడుతూ, దేవి శరన్నవరాత్రి ఉత్సవాలను భక్తిశ్రద్ధలతో నిర్వహించుకుంటున్న కాలనీవాసులకు శుభాకాంక్షలు తెలిపారు.కాలనీవాసులందరూ ఏకమై అమ్మవారిని పూజించడం, ఉత్సవాలను కలిసికట్టుగా నిర్వహించడం అభినందనీయమని రావు పద్మ అన్నారు. ఇలాంటి కార్యక్రమాలు విజయవంతం కావాలంటే అందరిలో ఐక్యత, సహకారం ఉండాలని, పోచమ్మకుంటలో ఆ ఐక్యతను తాను చూశానని పేర్కొన్నారు. అమ్మవారి ఆశీస్సులు కాలనీవాసులందరిపై ఎల్లప్పుడూ ఉండాలని ఆకాంక్షించారు.అనంతరం మహిళలతో కలిసి రావు పద్మ కోలాటం ఆడారు. డప్పులు, డీజే సంగీతం నడుమ భక్తులు ఆటపాటలతో దుర్గామాత విగ్రహాన్ని మండపం వద్దకు తీసుకువచ్చారు. దీంతో పోచమ్మకుంటలో పండుగ వాతావరణం నెలకొంది.పోచమ్మకుంట వెల్ఫేర్ అసోసియేషన్, ఫ్రెండ్స్ యూత్ అసోసియేషన్ ఆధ్వర్యంలో కాలనీవాసుల సహకారంతో ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ వేడుకల్లో బీజేపీ జిల్లా నాయకులు ఆదిత్య సాయి, పొట్ల శ్రీరామ్‌తో పాటు కాలనీలోని చిన్నారులు, మహిళలు, పెద్దలు పెద్ద సంఖ్యలో పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేశారు.

## నిత్యం నిఘా కార్యాలయం ఎదుట ఘనంగా బొడ్డెమ్మ వేడుకలు

### హనుమకొండ, పోచమ్మకుంటలో చివరి రోజు కార్యక్రమం





**హనుమకొండ / పోచమ్మకుంట , అక్టోబర్ 09 (నిత్యం నిఘా ప్రతినిధి) :** హనుమకొండలోని పోచమ్మకుంటలో నిత్యం నిఘా కార్యాలయం ఎదుట బొడ్డెమ్మ చివరి రోజు వేడుకలను ఘనంగా నిర్వహించారు. సంప్రదాయ బద్ధంగా బొడ్డెమ్మను పూజిస్తూ మహిళలు, స్థానికులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు. భక్తిశ్రద్ధలతో నిర్వహించిన వేడుకలతో కార్యాలయం పరిసరాల్లో పండుగ వాతావరణం నెలకొంది.

# బతుకమ్మ వేడుకలకు జమ్మికుంట మున్సిపాలిటీ సన్నద్ధం

### బొమ్మలగుడి శివాలయం ఆవరణలో ఏర్పాట్ల పరిశీలన

**కరీంనగర్ జిల్లా, జమ్మికుంట, అక్టోబర్ 09 (నిత్యం నిఘా ప్రతినిధి) :** తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలకు ప్రతీకగా నిలిచే బతుకమ్మ పండుగ వేడుకలను ఘనంగా నిర్వహించేందుకు జమ్మికుంట మున్సిపాలిటీ సన్నద్ధమవుతోంది. తొమ్మిది రోజులపాటు జరిగే బతుకమ్మ ఉత్సవాలు ఎంగిలిపూల బతుకమ్మతో ప్రారంభమై సద్దుల బతుకమ్మతో ముగియనున్న నేపథ్యంలో, పట్టణంలోని మహిళలు, యువతులు వేడుకల్లో పాల్గొనేందుకు వీలుగా మున్సిపల్ అధికారులు ఏర్పాట్లు చేపట్టారు. ఈ క్రమంలో బొమ్మలగుడి శివాలయం ఆవరణలో జరుగుతున్న ఏర్పాట్లను మున్సిపల్ చైర్మన్ మొలుగు ప్రశాంత్ కుమార్ దిలీప్ పరిశీలించారు. బతుకమ్మ వేడుకలకు హాజరయ్యే మహిళలు, ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా అవసరమైన సౌకర్యాలు కల్పించాలని సంబంధిత అధికారులకు సూచించారు. వేడుకలు జరిగే ప్రాంగణంలో పరిశుభ్రత, తగినంత స్థలం, ఇతర మౌలిక సదుపాయాల కల్పనపై ప్రత్యేక శ్రద్ధ వహించాలని ఆదేశించారు. తెలంగాణ ఆడపడుచుల ఆత్మీయతకు, ప్రకృతి ఆరాధనకు ప్రతీకగా నిలిచే బతుకమ్మ పండుగను మహిళలు, యువతులు సంతోషంగా, సంప్రదాయబద్ధంగా జరుపుకునేలా మున్సిపాలిటీ తరఫున అవసరమైన ఏర్పాట్లు చేస్తున్నట్లు చైర్మన్ తెలిపారు. ఈ కార్యక్రమంలో స్థానిక కౌన్సిలర్ చంద రాజు, మున్సిపల్ మేనేజర్ గుర్రాల రాజిరెడ్డి, సహాయ ఇంజినీర్ వికాస్, శ్రీను తదితరులు పాల్గొన్నారు.



# సిరికొండలో బిఆర్ఎస్ నాయకుల తీవ్ర హెచ్చరిక

### - "రైతులను దోచుకుంటే ఊరుకునేది లేదు



**నిజామాబాద్ రూరల్ సిరికొండ, అక్టోబర్ 09 (నిత్యం నిఘా ప్రతినిధి) :** కష్టపడి పండించిన వరి ధాన్యానికి మద్దతు ధర దక్కుతున్న తరుణంలో, కొంతమంది రైస్ మిల్లర్లు సిండికేట్‌గా ఏర్పడి రైతులను ఇబ్బందులకు గురిచేయడాన్ని సిరికొండ మండల బిఆర్ఎస్ (BRS) నాయకులు తీవ్రంగా ఖండించారు. రైతుల పక్షాన నిలబడి పోరాడతామని, ధాన్యం కొనుగోలు విషయంలో దోపిడీకి పాల్పడితే సహించేది లేదని హెచ్చరించారు.ఈ సందర్భంగా బిఆర్ఎస్ మండలం అధ్యక్షుడు నారవోయినా శ్రీనివాస్ మాట్లాడుతూ... "రైతుల కష్టాన్ని వ్యాపారంగా మార్చుకుని, వారిని బెదిరించడం సరైన పద్ధతి కాదు. రైతులకు న్యాయంగా అందాల్సిన మద్దతు ధరను అడ్డుకునే ప్రయత్నాలను వెంటనే మానుకోవాలి. రైతుల చెమటకు సరైన విలువ ఇవ్వాలి తప్ప, వారి శ్రమను దోచుకోవాలని చూస్తే చూస్తూ ఊరుకోం. ఇప్పటికైనా రైస్ మిల్లుల యాజమాన్యాలు తమ వైఖరిని మార్చుకుని, రైతులకు పూర్తి న్యాయం చేయాలి" అని స్పష్టం చేశారు.ఉచిత కరెంటుపై కాంగ్రెస్ ప్రభుత్వం మడమతిప్పింది: ఎన్నికల సమయంలో అధికారంలోకి వస్తే 24 గంటల ఉచిత విద్యుత్ అందిస్తామని హామీ ఇచ్చిన కాంగ్రెస్ పార్టీ, అధికారంలోకి వచ్చాక రైతులకు 8 నుండి 9 గంటల కరెంటు కూడా సరిగా ఇవ్వడం లేదని నాయకులు మండిపడ్డారు. ఇప్పటికైనా రాష్ట్ర ప్రభుత్వం తన తీరు మార్చుకుని, వ్యవసాయానికి తగినంత నాణ్యమైన విద్యుత్‌ను అందించాలని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో బిఆర్ఎస్ ఆధ్వర్యంలో పెద్ద ఎత్తున రైతు ఉద్యమాన్ని చేపడతామని హెచ్చరించారు.ఈ కార్యక్రమంలో మండల బిఆర్ఎస్ ముఖ్యనాయకులు, మచర్ల భూషణ్ రెడ్డి, ఆకుల తిరుమల్, నర్సారెడ్డి కార్యకర్తలు పాల్గొన్నారు.